Follow: @mahaadaily 25-12-2025


# మహా పత్రిక

ఏఎన్ఎన్ తెలుగు

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 1 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


మహా పత్రిక పాఠకులు, ప్రకటనకర్తలు మరియు ప్రజలందరికీ ఏఎన్ఎన్ & మహా యాజమాన్యం తరుపున క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు



## ఢిల్లీ మెట్రో విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### రూ.12,015 కోట్లతో భారీ ప్రాజెక్టు

హైదరాబాద్ మెట్రో విస్తరణకు మళ్ళీ మొండిచేయి

**ఢిల్లీ, మహా:** దేశ రాజధాని ఢిల్లీలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఢిల్లీ మెట్రో నాలుగో దశ విస్తరణకు ఆమోదం లభించింది. ఈ మెట్రో విస్తరణ ప్రాజెక్టు కోసం రూ.12,015 కోట్లను కేటాయిస్తూ కేబినెట్ తీర్మానించింది. పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, సామాన్యులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.12,015.92 కోట్లుగా నిర్ధారించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం మరియు ఢిల్లీ ప్రభుత్వాలు తమ వాటాను భరించనుండగా, మిగిలిన మొత్తాన్ని జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల ద్వారా సమీకరించనున్నారు. ఈ పనులన్నింటినీ మార్చి 2029 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. టెండర్ల ప్రక్రియ మరియు భూసేకరణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. కాగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం రెండేళ్ళుగా విజ్ఞప్తిచేస్తున్నా మళ్ళీ మొండిచేయి చూపింది.

**టాప్ న్యూస్**

### అంత పెద్ద మాటలొద్దు

- మేం చిన్న పిల్లలం కాదు
- శివాజీకి అనసూయ కౌంటర్



02

### నువ్వే ఫ్లాఫ్ యాక్టర్

- చెప్పుదెబ్బలు తింటావ్
- శివాజీకి మహిళా కాంగ్రెస్ నేత సునితా రావు వార్నింగ్



02

### ఆ ముగ్గురూ ఒకటే...

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపేందుకు ఎంఐఎం ప్రయత్నాలు
- బిజెపి చీఫ్ రామచందర్ రావు



02

# జనవరి 16న దానం రాజీనామా?

- బెంగాల్‌తో కలిపి ఖైరతాబాద్ దంగల్
- తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అని తేల్చేసిన దానం
- రాజీనామాకు రెడీ.. మళ్ళీ బరిలోకి సై
- సంక్రాంతి తర్వాత సుప్రీంలో విచారణ

(హైదరాబాద్ - మహా)

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జనవరి 16న రాజీనామా చేసే అవకాశాలున్నాయని ఉన్నతస్థాయి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఓవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంలో అటు సుప్రీంకోర్టు, ఇటు స్పీకర్ విచారణ తీర్పుల నేపథ్యంలో..ఎంపీగా కాంగ్రెస్ నుండి పోటీచేసిన దానం నాగేందర్ తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేనేనని బుధవారం స్పష్టతనిచ్చారు. స్పీకర్ కు సమాధానం ఇవ్వకపోయినా సీఎం ఆదేశాలే తమకు శిరోధార్యమని గత కొంతకాలంగా చెబుతున్న దానం నాగేందర్ బుధవారం మీడియా మైకుల ముందు తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేనేనని, జీహెచ్ఎంసి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. దానం నాగేందర్ భవితవ్యంపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఉన్న సమయంలో స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. బైపోల్ అనివార్యమైతే మళ్ళీ దానం నాగేందర్ ను అభ్యర్థిగా నిలిపేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు దానం నాగేందర్ వర్గీయులు చెబుతున్నారు. జూబ్లీహిల్స్ బైపోల్ లో కాంగ్రెస్ ఘన విజయం సాధించగా, ఖైరతాబాద్ లోనూ అదే మ్యాజిక్ కంటిన్యూ అవుతుందని దానం నాగేందర్ ధీమాగా ఉన్నారు. జనవరి 16న సుప్రీంకోర్టులో ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు తిరిగి విచారణకు రానుండగా, ఆ రోజే రాజీనామా చేయించాలన్న వ్యూహంతో కాంగ్రెస్ పార్టీ ఉందని, రాజీనామాకు దానం సిద్దంగా ఉన్నట్లు పార్టీ ముఖ్యులు చెబుతున్నారు.

మిగతా 2లో

### బెంగాల్‌తో దంగల్

ఏప్రిల్ మేలో పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం ఎన్నికలు జరగనుండగా, బెంగాల్ ఎన్నికలతోటే ఖైరతాబాద్ బైపోల్ కూడా వస్తుందన్న అంచనాలో నేతలున్నారు. అయితే ఇవన్నీ సుప్రీంకోర్టులో విచారణ, దానం రాజీనామాను బట్టి ఉండనున్నాయి. ఇంతకాలం టికెట్ పై స్పష్టత లేక ఆందోళన చెందిన దానం నాగేందర్ కు ఒక వేళ బైపోల్ వస్తే టికెట్ మీకే ఇస్తామని హైకమాండ్ స్పష్టతనిచ్చినట్లు చెబుతున్నారు. ఒక దశలో విజయారెడ్డి, రోహిణ్ రెడ్డి వంటి రకరకాల పేర్లు వినిపించగా, వీటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టి దానంకు హైకమాండ్ వారం క్రితం స్పష్టమైన హామీనిచ్చిందని.. అయితే తప్పనిపరిస్థితి అయితేనే రాజీనామా చేసే అవకాశముందని తెలుస్తోంది. రాజీనామాకు సిద్దపడి అస్త్రశస్త్రాలు అన్నీ సిద్దం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మాత్రం జనవరి 16న సుప్రీంలో విచారణ ఉందని, ఆరోజు రాజీనామాకు డిసైడై సిద్దంగా ఉన్నట్లు తెలుస్తోంది.






### దేశంలో మూడు కొత్త ఎయిర్ లైన్స్

- త్వరలో శంఖ్ ప్రారంభం.. కొత్తగా అల్ హింద్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ లకు అనుమతి
- ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కొత్త కంపెనీలకు గ్రీన్ సిగ్నల్

వివరాలు 2లో



### ఏం ప్లాన్ చేశావ్ బుచ్చి

పిఎంవోలోనే షూట్ పెట్టిన పెద్ది

వివరాలు 2లో



## కేసీఆర్‌కు అధికారం దక్కనివ్వను

# ఇదే నా శపథం

### కొడంగల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

- నేను రాజకీయాల్లో ఉన్నంతవరకు బీఆర్ఎస్‌కు అధికారం కల
- మీ చరిత్ర ముగిసింది.. మీ పార్టీకి భవిష్యత్ లేదు
- ప్రతీ ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తున్నా.. పైచేయి మాదే అంటారా?
- దమ్ముంటే.. 29న అసెంబ్లీకి రా
- నీ కండలు కరిగి.. తోలు మిగిలింది. నీకా నేను భయపడేది.
- నన్ను ఎన్నిరకాలుగా ఇబ్బందులు పెట్టినా.. నేను పగకు పోలేదు
- కేటీఆర్ మా ఊరికి వస్తవా.. మీ ఊరికి రావాలా?

**కొడంగల్, మహా :** తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ‘‘రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు.

మిగతా 2లో


# పల్లెలకు రేవంత్ వరం

### 12,769 పంచాయతీలకు రూ. 700 కోట్ల ప్యాకేజీ

చిన్న, పెద్ద పంచాయతీలకు నిధుల పంపిణీ షురూ

రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్

గ్రామాల ముఖచిత్రం మార్చేలా సీఎం నిర్ణయం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పాలన వ్యవస్థను సమూలంగా మార్చేసి, పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది గ్రామ పంచాయతీలకు ఊపిరి పోసేలా భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా నేరుగా గ్రామాలకు నిధులు మంజూరు చేయాలన్న సీఎం నిర్ణయం, రాష్ట్రంలోని సుమారు 12,769 గ్రామ పంచాయతీలకు లబ్ధి చేకూర్చనుంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, జనాభా మరియు విస్తీర్ణం ఆధారంగా నిధులను వర్గీకరించి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం 12,769 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో జనాభా ప్రాతిపదికన మెజారిటీ గ్రామాలు చిన్న పంచాయతీల పరిధిలోకి వస్తాయి. దాదాపు 12 వేల వరకు ఉన్న ఈ చిన్న గ్రామాలకు ఒక్కొక్కటికీ రూ. 5 లక్షల చొప్పున కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక 5 వేల జనాభా దాటిన లేదా మేజర్ పంచాయతీలుగా పిలవబడే సుమారు 700 నుంచి 800 గ్రామాల వరకు రూ. 10 లక్షల చొప్పున ప్రత్యేక నిధులను మంజూరు చేయనున్నారు.

మిగతా 2లో

### డీజీపీ శివధర్‌రెడ్డి నియామకంపై

## హైకోర్టు కీలక ఆదేశాలు

- సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ పాటించండి
- డీజీపీ నియామక వివాదంపై హైకోర్టు స్పష్టత
- వచ్చే నెల 20కి డీజీపీ నియామక కేసు వాయిదా

02



## ఏఐ సాయంతో కాపీయింగ్

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నయా మోసం
- చెవిలో బ్లూటూత్.. షర్ట్‌లో మైక్రో స్కానర్
- హెచ్‌సీయూ పరీక్షల్లో చిక్కిన హర్యానా యువకులు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో నిర్వహించిన రిక్రూట్‌మెంట్ పరీక్షలో అత్యంత ఆధునిక సాంకేతికతను ఉపయోగించి కాపీయింగ్‌కు పాల్పడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

మిగతా 2లో



### కాంగ్రెస్ జిల్లా కార్యవర్గాలపై..

## టీపీసీసీ మార్గదర్శకాలు

విధిగా పాటించాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు

**హైదరాబాద్, మహా :** జిల్లా కమిటీలపై టీపీసీసీ కసరత్తులు ప్రారంభించింది. దీనిలో భాగంగా డీసీసీ అధ్యక్షులకు జిల్లా కార్యవర్గాల ఏర్పాటుకు సంబంధించి వివిధ హోదాలు, సంఖ్యా విధానాలపై టీపీసీసీ మార్గదర్శకాలు విడుదల చేసింది.

మిగతా 2లో



## జనవరి 16న దానం రాజీనామా?

(మొదటిపేజీ తరువాయి)

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఎమ్మెల్యేలపై స్పీకర్ విచారణ కొనసాగుతున్న వేళ తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నట్టు దానం కుండబద్దలు కొట్టారు. అంతేకాకుండా.. తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుందంటూ జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాతో మాట్లాడుతూ.. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారో నాకు తెలియదు. నేను మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించబోతున్నాం. ఎంఐఎంతో కలుపుకుని కాంగ్రెస్ 300 డివిజన్లలో గెలుస్తుంది. గ్రేటర్ హైదరాబాద్‌వ్యాప్తంగా 300 డివిజన్లలో తిరుగుతాను. కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరిస్తాను. నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## ఆ ముగ్గురూ ఒకటే...

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీలను కలపడానికి ఎంఐఎం పార్టీ ప్రయత్నిస్తోందని, భవిష్యత్తులో ఆ మూడు పార్టీలు కలిసి ఎన్నికలకు వెళ్లడం ఖాయమని బిజెపి స్టేట్ చీఫ్ ఎన్. రామచందర్ రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ చేరినట్లుగా ఆధారాలు ఉన్నా అసెంబ్లీ స్పీకర్ వారిపై చర్యలు తీసుకోకపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసినట్లేనని రాంచందర్‌రావు తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. గ్రామాలకు సంవత్సరానికి రూ.3 వేల కోట్ల నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమేనని ఆయన విమర్శించారు. ఎన్నికలు సకాలంలో ఎన్నికలు జరగకపోవడంతో గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని అన్నారు.

## నువ్వో ఫ్లాఫ్ యాక్టర్

**హైదరాబాద్, మహా:** ఏ తల్లి కన్నదో ఆ తల్లిని ఇను పసామాన్ల డబ్బాతో శివాజీ పోల్చడం పాలు తాగి రొమ్ముగుద్దే రకంగా ఉందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు అన్నారు. గతంలో శివాజీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు కలిగిన బీజేపీతో ఉన్నాడన్నారు. మొన్న నితీష్ కుమార్ కూడా ఓ మహిళ హిజాబ్ గుంజారన్నారు. శివాజీ ఫ్లాప్ యాక్టర్ అని పబ్లిసిటీ కోసమే ఇలాంటివి చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా మాట్లాడితే మహిళల చేతిలో చెప్పుదెబ్బలు తప్పవన్నారు. ఆయన గురించి మాట్లాడడం కూడా అనవసరం అన్నారు. మహిళా కమిషన్ ఇప్పటికే సుమోటాగా కేసును స్వీకరించిందని చర్యలు కూడా తప్పవన్నారు.

## ఏం ప్లాన్ చేశావ్ బుచ్చి

**మహా:** రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఈ సినిమా భారీగా తెరకెక్కుతుంది. ఈ సినిమా ఏకంగా పిఎంవోలోనే క్యాంప్ పెట్టింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఢిల్లీలో జరుగుతోంది. ఢిల్లీలో భారీగా షూటింగ్ ప్లాన్ చేస్తున్నారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియంతో పాటు, ఏపీ భవన్, పార్లమెంట్ బయట వీధుల్లో, ఇండియా గేట్ వద్ద షూటింగ్ చేస్తున్నారట. అలాగే పీఎం ఆఫీస్ లో కూడా షూటింగ్ చేస్తున్నారు. ప్రైమ్ మినిస్టర్ మ్యూజియం, లైబ్రరీ - ప్రధానమంత్రి సంగ్రహాలయలో కూడా షూటింగ్ చేస్తున్నారని సమాచారం. ఆల్రెడీ రామ్ చరణ్ ప్రైమ్ మినిస్టర్ మ్యూజియం, లైబ్రరీని సందర్శించి అక్కడ అధికారులను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆర్ ఆర్ఆర్ సినిమాతో రామ్ చరణ్‌కి నార్త్ లో బాగా పేరొచ్చింది. ఢిల్లీలో పెద్ది షూటింగ్ జరుగుతుండటంతో భారీగా జనాలు చరణ్ ని చూడటానికి వచ్చారు. అక్కడి పోలీసులు కూడా చరణ్‌తో ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపించారు. ఇటీవల కాలంలో రామ్ చరణ్ సతీమణి ఉపాసన కూడా తరచూ ఢిల్లీలో కనబడుతున్నారు. ఢిల్లీ సీఎంతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.





## కేసీఆర్‌కు అధికారం దక్కనివ్వను

# ఇదే నా శపథం

(మొదటిపేజీ తరువాయి)

చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా.

**దుబాయ్ పంపుతామని మోసం చేయలే**

రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితే పాతాళానికి వెళ్లారు.

**సొంతచెల్లినే మెడలు పట్టి బయటకు పంపావు.. నువ్వు మనిషివేనా?**

రెండేళ్ల నుంచి ఫాంహౌజ్‌నే కేసీఆర్ జైలుగా మార్చుకున్నారు. మొన్నే బయటకు వచ్చాడు.తోలు తీస్తానంటూ ఏదో మాట్లాడారు. రెండేళ్లు ఫామ్‌హౌజ్‌లో అదే పని చేశారా?..మా సర్పంచ్‌ల దగ్గరికి రా ఎవరి తోలు తీస్తారో చూద్దాం. చింత మడకలో చీరి చింతకు కడతారు. నేకేసీఆర్ చేయని పాపం అంటూ లేదు. సొంతల్లుడి ఫోన్‌నే ట్యాపింగ చేయించాడు. సొంత బిడ్డకే చీర పెట్టలేనోడు.. మాపైమాట్లాడతారా?. ఇన్ని ఎన్నికలు జరుగుతున్నా.. జనం బండకేసి కొడుతున్నా.. సిగ్గు రావడం లేదు. కేసీఆర్ ఉడత ఊపులకు భయపడేవాడిని కాదు నేను. పండక్కి చెల్లెల్ని కూడా ఇంటికి పిలవలేనోడు కేటీఆర్. తండ్రి గాలికి సంపాదించిన వాటా పంచాల్సి వస్తుందని సొంత చెల్లినే మెడలు పట్టి బయటకు పంపించావ్. సొంత చెల్లికే సమాధానాలు చెప్పలేనోడు నాకే సవాల్ విసురుతాడా?.. కేటీఆర్ నువ్వెంత.. నీ స్థాయి ఎంత..? నీలా అమాయకుల్ని నేను మోసం చేయలేదు. అలాంటిది నేను నీకు భయపడతానా?.. హరీష్‌రావు ఆరడుగులు పెరిగిండు.. కానీ తలకాయే లేదు. నీ కండలు కరిగి.. తోలు మిగిలింది. నీకా నేను భయపడేది.

**బీఆర్ఎస్, కేసీఆర్ గతమే..**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండోసారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసి పెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదు.

**కేసీఆర్ అసెంబ్లీకి వస్తే.. ఏ అంశంపైనైనా చర్చిద్దాం**

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడించినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు. నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దాం.. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారు'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## పల్లెలకు రేవంత్ వరం

(మొదటిపేజీ తరువాయి)

ఈ గణాంకాలను బట్టి చూస్తే, రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 650 కోట్ల నుంచి రూ. 700 కోట్ల వరకు నిధులను కేవలం గ్రామాల అభివృద్ధి కోసమే విడుదల చేయనుందని స్పష్టమవుతోంది.ముఖ్యంగా 500 లోపు జనాభా ఉన్న 886 గ్రామాలు, 500 నుంచి 1000 మధ్య జనాభా ఉన్న 4,300 గ్రామాలు, అలాగే 5000 లోపు జనాభా ఉన్న 7,435 గ్రామాలు ఈ పథకం ద్వారా అత్యధిక లబ్ధి పొందనున్నాయి. నిధుల కొరతతో కునారిల్లుతున్న ఈ చిన్న గ్రామాలకు రూ. 5 లక్షల గ్రాంట్ అనేది ఒక పెద్ద ఊరటగా మారనుంది. ఈ నిధులతో గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తాగునీటి సరఫరాలో అవాంతరాలను తొలగించడం, పాడైన విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల మరమ్మతులు వంటి అత్యవసర పనులను సర్పంచ్‌లు వెంటనే చేపట్టవచ్చు. ఈ నిధుల మంజూరు ప్రక్రియ ద్వారా సర్పంచ్‌లకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించడమే కాకుండా, పరిపాలనలో జవాబుదారీతనాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో చిన్న చిన్న బిల్లుల కోసం కూడా నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు ఎస్‌డీఎఫ్ నిధులు నేరుగా అందుబాటులోకి రావడం వల్ల అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని అధికారులు చెబుతున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే పల్లెలు ఆర్థికంగా బలపడాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనకు ఈ నిర్ణయం అద్దం పడుతోంది. త్వరలోనే ఈ నిధులు గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ కానుండటంతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## ఏఐ సాయంతో కాపీయింగ్




(మొదటిపేజీ తరువాయి)

నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీలో భాగంగా జరిగిన ఈ పరీక్షలో హర్యానాకు చెందిన అనిల్, సతీష్ అనే ఇద్దరు యువకులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానంతో మోసానికి తెరలేపారు. వీరు తమ షర్ట్ బటన్ల లోపల అతి సూక్ష్మమైన మైక్రో స్కానర్లను అమర్చుకుని పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించారు. ఈ స్కానర్ల ద్వారా ప్రశ్నా పత్రాన్ని స్కాన్ చేసి, బయట ఉన్న వ్యక్తులకు లేదా ఏఐ టూల్స్ కు సమాచారాన్ని చేరవేసేలా ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ నుంచి వచ్చే సమాధానాలను వినడానికి తమ చెవుల్లో ఎవరికీ కనిపించని చిన్న పాటి బ్లూటూత్ పరికరాలను అమర్చుకున్నారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ఒక అభ్యర్థి ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్, అతడిని నిశితంగా గమనించారు. అభ్యర్థి చెవి దగ్గర నుంచి స్వల్పంగా శబ్దాలు వస్తుండటాన్ని గుర్తించి తనిఖీ చేయగా అసలు విషయం బయటపడింది. షర్ట్ బటన్ల రూపంలో ఉన్న కెమెరాలు, స్కానర్లు చూసి అధికారులు విస్మయానికి గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మరొక అభ్యర్థిని కూడా తనిఖీ చేయగా, అతను కూడా అదే పద్ధతిలో కాపీ కొడుతున్నట్లు తేలింది. నిందితులు ఏఐ టెక్నాలజీ సాయంతో ప్రశ్నలకు వెంటనే సమాధానాలు పొందుతున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. యూనివర్సిటీ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని నిందితులిద్దరిని గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి హైటెక్ స్కానర్లు, బ్లూటూత్ పరికరాలు , మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఏదైనా పెద్ద ముఠా హస్తం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత ఉండే కేంద్ర విశ్వవిద్యాలయంలోనే ఇలాంటి హైటెక్ కాపీయింగ్ జరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా మరిన్ని కఠిన నిబంధనలు అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

### డీజీపీ శివధర్‌రెడ్డి నియామకంపై

## హైకోర్టు కీలక ఆదేశాలు

### సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ పాటించండి

- డీజీపీ నియామక వివాదంపై హైకోర్టు స్పష్టత
- వచ్చే నెల 20కి డీజీపీ నియామక కేసు వాయిదా



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర డీజీపీగా శివధర్‌రెడ్డి నియామకానికి సంబంధించినవివాదంలో రాష్ట్ర హైకోర్టు బుధవారం అత్యంత కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నియామక ఉత్తర్వులను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం, ప్రస్తుతానికి ఆ ఉత్తర్వులను రద్దు చేసేందుకు నిరాకరించింది. అయితే, డీజీపీ నియామక ప్రక్రియలో సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది. అర్హత కలిగిన పోలీస్ అధికారుల పేర్లతో కూడిన ప్యానెల్ జాబితాను రెండు వారాల్లోగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ జాబితా తయారీలో సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా సీనియారిటీ మరియు నిష్పక్షపాత విధానాలను అనుసరించాలని సూచించింది. యూపీఎస్సీకి జాబితా పంపిన అనంతరం, ఈ వ్యవహారంపై పూర్తి వివరణతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను కోర్టులో దాఖలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డికి ఈ తీర్పుతో కొంత ఊరట లభించినప్పటికీ, ప్యానెల్ ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వం కోర్టు ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో తీసుకునే తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ నియామక వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను హైకోర్టు వచ్చే నెల 20వ తేదీకి వాయిదా వేసింది. అప్పటిలోగా ప్రభుత్వం యూపీఎస్సీకి పంపే నివేదిక మరియు కోర్టులో దాఖలు చేసే కౌంటర్ ఈ కేసులో కీలకం కానున్నాయి.

### కాంగ్రెస్ జిల్లా కార్యవర్గాలపై..

## టీపీసీసీ మార్గదర్శకాలు

### విధిగా పాటించాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ మేరకు ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్, ఇంచార్జ్ సెక్రటరీలు విశ్వనాథన్ పెరమాళ్, సచిన్ సావంత్ లు నిర్వహించిన విస్తృత చర్చల అనంతరం ఈ మార్గదర్శకాలను జిల్లా నాయకులు, బాధ్యులు విధిగా పాటించాలని ఆదేశాలు జారీ చేశారు.

**జిల్లా కార్యవర్గంలో...**

జిల్లా నుంచి ఒక కోశాధికారి పదవిని కేటాయించాలి. ఉపాధ్యక్ష పదవికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతి బ్లాక్ నుంచి ఒకరు, ఒక నియోజకవర్గంలో ఎన్ని బ్లాకులు ఉంటే అంతమందిని ఈ పదవిలో నియమించవచ్చు. ప్రధాన కార్యదర్శి పదవికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో, ప్రతి బ్లాక్ నుంచి ఇద్దరు చొప్పున నియమించాలి అంటే నియోజకవర్గంలో రెండు బ్లాకులుంటే నలుగురు ప్రధాన కార్యదర్శులు ఉంటారని పేర్కొన్నారు. కార్యదర్శి పదవికి ప్రతి మండలానికి ఒకరు చొప్పున ఎంపిక చేయాలి. జిల్లాలో ఉన్న మొత్తం మండలాల సంఖ్యకు అనుగుణంగా కార్యదర్శుల సంఖ్య ఉండాలి. జిల్లా అధికార ప్రతినిధి పదవికి ప్రతి నియోజకవర్గాన్ని ఒకరు చొప్పున నియమించాలి. జిల్లా కార్యవర్గ సభ్యుల నియామకంలో గరిష్టంగా 15 మంది వరకు సంఖ్యను నియమించుకోవచ్చు. జిల్లా పార్టీకి చెందిన సీనియర్ నేతలకు ఈ కమిటిలో ప్రాతినిధ్యం కల్పించుకోవచ్చు. అయితే సంఖ్యను టీపీసీసీ చీఫ్ అనుమతితో తుది నిర్ణయం తీసుకుంటారు.

**కార్పోరేషన్, మున్సిపాలిటీలయితే ఇలా**


ఉపాధ్యక్ష పదవి ఒక బ్లాక్ నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం. ప్రధాన కార్యదర్శులు ప్రతి 10వార్డులకు ఒకరు చొప్పున నియామకం ఉంటుంది. కార్యదర్శులు ప్రతి 5వార్డులకు ఒకరు చొప్పున నియామకం ఉంటుంది. కార్యవర్గ సభ్యులు ఆయా పట్టణాల్లోని వార్డుల సంఖ్య ఆధారంగా నిర్ణయించాలి. ఒక కార్పోరేషన్ పరిధిలో ఎన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయో వాటిని అనుసంధాన్ని పరిగణలోకి తీసుకొని జిల్లా కార్యవర్గాల కూర్పును చేసుకోవాలి. జిల్లా కార్యవర్గ కమిటి కూర్పు తుది రూపం దాల్చిన అనంతరం కమిటిని టీపీసీసీ అధ్యక్షుడు మాత్రమే ప్రకటిస్తారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళనల సందర్భంలో నమోదైన కేసులు తప్ప ఇతర తీవ్ర క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులను కార్యవర్గ కమిటీలో ఎట్టి పరిస్థితుల్లో పరిగణలోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

జిల్లా కార్యవర్గ కమిటీ ఏర్పాటు సమయంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రానిథ్యం కల్పించాలి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మహిళలను సమతుల్యంగా పరిగణలోకి తీసుకొని 60శాతం సోషల్ ఇంజనీరింగ్ ను పాటించాలి. మహిళకు కనీసం 20 నుంచి 25శాతం డీసీసీ కమిటీల్లోని అన్ని స్థాయిల్లో అవకాశం కల్పించాలి. జిల్లా కార్యవర్గం ఏర్పాటులో సందేహాలు, భిన్నాభిప్రాయాలు లేదా అనివార్య పరిస్థితులు ఎదురైతే టీపీసీసీ చీఫ్‌అనుమతి తీసుకోవాలి. కొన్ని జిల్లాల్లో పక్క జిల్లాలకు చెందిన మండలాలు కలిసివున్నట్లైయితే ఆ మండలాలను మండలంగా మరియు బ్లాక్ ను బ్లాక్ గా పరిగణించాలని పార్టీ ఆదేశించింది.

## దేశంలో మూడు కొత్త ఎయిర్ లైన్స్

**త్వరలో శంఖ్ ప్రారంభం.. కొత్తగా అల్ హింద్, ఫ్లై ఎక్స్ ప్రెస్ లకు అనుమతి**

**ఇండిగో సంక్షోభం నేపథ్యంలో కొత్త కంపెనీలకు గ్రీన్ సిగ్నల్**




**ఢిల్లీ, మహా :** దేశంలో మరో రెండు విమానయాన సంస్థలకు పౌరవిమానయాన శాఖ అనుమతి ఇచ్చింది. అల్ హింద్, ఫ్లై ఎక్స్‌ప్రెస్ విమాన సంస్థలకు ఎన్ ఓసి జారీ చేసింది. ఇప్పటికే అనుమతి పొందిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన విమాన సంస్థ శంఖ్ ఎయిర్ త్వరలో సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉంది. అల్ హింద్ ఎయిర్ సంస్థను కేరళకు చెందిన అల్‌హింద్ గ్రూప్ ప్రమోట్ చేస్తోంది. ఇండిగో వివాదం నేపథ్యంలో ప్రభుత్వం దేశంలో మరిన్ని విమానయాన సంస్థలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నందున మరిన్ని విమానయాన సంస్థలు ఉండాలని భావిస్తోంది. భారత్‌లో గత కొన్నేళ్లలో విమానాశ్రయాలతో పాటు విమాన సర్వీసుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. కానీ విమానయాన సంస్థల సంఖ్య అంతగా పెరగలేదు. ప్రస్తుతం దేశంలో 9 షెడ్యూల్డ్ క్యారియర్స్ ఉన్నాయి. ఇండిగో, ఎయిరిండియా గ్రూప్ కలిసి దేశంలో 90 శాతం మార్కెట్ షేర్‌ను కలిగి ఉన్నాయి. అంటే 2 పెద్ద కంపెనీలే ఈ రంగాన్ని ఏలుతున్నాయి. ఈ క్రమంలోనే దేశంలో మరిన్ని విమానయాన సంస్థలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## అంత పెద్ద మాటలొద్దు


**మేం చిన్నపిల్లలం కాదు.. శివాజీకి అనసూయ కౌంటర్**



**మహా :** దండోరా మూవీ ప్రెస్‌మీట్‌లో శివాజీ తనపై చేసిన కామెంట్స్‌పై అనసూయ భరద్వాజ్ స్పందించింది. ప్రత్యేకంగా యాంకర్, నటి అనసూయ పేరు ప్రస్తావిస్తూ శివాజీ కౌంటర్ ఎటాక్ చేశారు. తాను అభద్రతాభావంతో ఉన్నది నిజమేనమ్మా.. మీ రుణం కూడా త్వరలోనే తీర్చుకునే అవకాశం రావాలని దేవుడిని కోరుకుంటున్నా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. దీనిపై అనసూయ సీరియస్ గా రియాక్ట్ అయింది. అతి వినయం దూర్త లక్షణం అనేది నాకు చిన్నప్పటి నుంచే తెలుసని వెల్లడించింది. ఈ రోజు వీడియోలు చూస్తుంటే పెద్దవాళ్లు చెప్పింది కరెక్టే అనిపిస్తోందని తెలిపింది. ఈ రోజు ఆయన ప్రెస్‌మీట్‌లో విక్టిమ్ కార్డ్ ప్లే చేస్తున్నారు. ఒక నార్సిస్ట్‌కు ఉండే లక్షణం ఇదే.. చేతగానితనం వల్లే ఇలాంటి మాటలు వస్తాయని అన్నారు. ఫేక్ ఫెమినిజం అనేది ఎక్కడా లేదండి.. మగాళ్లతో పాటు ఆడవాళ్లకు కూడా సమాన హక్కులు ఉండాలన్నదే ఫెమినిజం అని తెలిపింది. అనసూయ మాట్లాడుతూ..' సెల్ఫ్ కంట్రోల్ లేనివాళ్లు, ఇన్ సెక్యూరిటీ వల్లే ఇలా మాట్లాడతారు. అందుకే పాపం సింపతీ కార్డ్ వాడేస్తున్నారు. నేనేందుకు అందులోకి లాగాను? మిమ్మల్ని ఏమన్నా అన్నానా అంటే? నేను కూడా హీరోయినే సార్.. మిమ్మల్ని ఇలానే బట్టలు వేసుకోవాలని మీకు ఎవరైనా చెబుతున్నారా? మీరు మా అందరికీ బట్టలు వేసుకోవాలనే చెప్పేంత చిన్నపిల్లలం కాదు. మీరు నన్ను లాగలేదు. కానీ కలెక్టివ్‌గా లాగారు. మీరు ఏదైతే బలంగా చెబుతున్నారో.. నేను కూడా అదే చెబుతున్నా. మీరే తెలివి గలవాళ్లు అనుకుంటే..సృష్టికి మూలమైన మాకు ఎంత ఉండాలి. మరణశిక్ష వేయండి అన్నారు. అలాంటివి వద్దు సార్. నిజంగానే మీకు ఆడవాళ్లపై గౌరవం ఉంటే.. ఏంట్రా అడవి జంతువుల్లా మీద పడటం.. ఆ అమ్మాయి అంత అందగా ఉంది. ఆమెను గౌరవించడని మగవాళ్లకే చెప్పండి' అని గట్టిగా ఇచ్చి పడేసింది.

## తైవాన్ తీరంలో భారీ భూకంపం

- రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రత నమోదు
- తైపీలో ఊగిన భవనాలు, స్వల్పంగా నిలిచిన రైలు సర్వీసులు



**ఢిల్లీ, మహా:** తైవాన్ దేశంలో బుధవారం మరోసారి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనలు ద్వీపదేశాన్ని ఒక్కసారిగా వణికించాయి. తైవాన్ సెంట్రల్ వెదర్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం తూర్పు తైవాన్‌లోని టైటుంగ్ కౌంటీ తీరానికి సమీపంలో సముద్ర గర్భంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.1గా నమోదైంది. భూ అంతర్భాగంలో సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు అధికారులు గుర్తించారు. తక్కువ లోతులో భూకంపం సంభవించడంతో దీని ప్రభావం ఉపరితలంపై చాలా బలంగా కనిపించింది. టైటుంగ్‌తో పాటు హువాలిన్, తైచుంగ్, రాజధాని తైపీ నగరాల్లో భూప్రకంపనలు స్పష్టంగా వినిపించాయి. తైపీ నగరంలోని ఆకాశహర్మ్యాలు దాదాపు 30 సెకన్ల పాటు ఊగడంతో కార్యాలయాల్లో ఉన్న ఉద్యోగులు, నివాస సముదాయాల్లోని ప్రజలు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ భారీ భూకంపం కారణంగా తైవాన్‌లోని హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌పై స్వల్ప ప్రభావం పడింది. భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో రైళ్లను నిలిపివేసి, పట్టాలను, ఇతర మౌలిక సదుపాయాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. అయితే ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, ఈ భూకంపం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం లేదా భారీ ఆస్తి నష్టం సంభవించలేదని స్థానిక విపత్తు నిర్వహణ శాఖ ప్రకటించింది. తీర ప్రాంతాల్లో సునామీ ముప్పు లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ, రాబోయే 24 నుంచి 48 గంటల పాటు శక్తివంతమైన ఆఫ్టర్ షాక్స్ (తదుపరి ప్రకంపనలు) వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు.

మహా పత్రిక
గురువారం, హైదరాబాద్
25-12-2025
04
WWW.MAHAADAILY.COM



**మహా ప్రత్యేకం:** రాజ్యాలు మారాయి... ప్రభుత్వాలు మారాయి... కానీ బంగారం మీద భారతీయుడి నమ్మకం మాత్రం మారలేదు. బంగారం అలంకారం మాత్రమే కాదు...అది కాలాన్ని జయించిన పెట్టుబడి. బంగారం భారతీయుల జీవితంలో కేవలం లోహం కాదు. ఆర్థిక భద్రత, సంప్రదాయం, సంక్షోభాల్లో ఆశ్రయం – అన్నింటికీ ప్రతీక. బంగారం ధర వెనక్కి తిరిగి చూడటం లేదు. రోజురోజుకీ పెరుగుతూనే ఉంది. పది గ్రాముల పసిడి (24 క్యారెట్లు) రూ.1.37-1.40 లక్షల ధర పలికింది. వెండి కిలో 2.4లక్షలను తాకింది.

## ఎందుకీ పరుగు?

గత మూడు నాలుగు సంవత్సరాలుగా బంగారం ఎంత పెరిగిందంటే.. దాని మెరుపు కంటే వేగంగా దూసుకెళ్తోంది. ఇకపై అది కేవలం ఆభరణాల వస్తువు మాత్రమే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన భాగంగా మారింది. ఒకప్పుడు పండుగలు, వివాహాలలో ప్రధానమైన ఈ పసుపు లోహం ఇప్పుడు ప్రతి పెట్టుబడిదారుడి పోర్ట్‌ఫోలియోలో గణనీయమైన స్థానాన్ని సంపాదించుకుంది. దీంతో గోల్డ్ రేట్ విపరీతంగా పెరిగింది. బంగారం కొనడం ఇకపై అందరికీ అందుబాటులో ఉండదనే సందేహం కలుగుతుంది. అసలు బంగారం ధర నిరంతరం పెరుగుతుండటానికి కారణం ఏమిటి..? అధిక మొత్తంలో బంగారం ఎవరు కొనుగోలు చేస్తున్నారు? అంటే అనేక కారణాలు ఉన్నాయి.

# సంక్షోభాల మధ్య మెరిసిన బంగారం

### సంక్షోభాల మధ్య మెరిసిన బంగారం.. భారత మార్కెట్‌లో రూ.1.40 లక్షల మైలురాయి

## ద్రవ్యోల్బణం సమస్య

ప్రపంచ ఆర్థిక అస్థిరత, ద్రవ్యోల్బణం, భౌగోళిక ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను కుదిపేశాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక లేదా రాజకీయ అనిశ్చితి పెరిగినప్పుడల్లా, ప్రజలు తమ డబ్బును సురక్షితంగా ఉంచుకోవడానికి చూస్తారు. అటువంటి పరిస్థితిలో, బంగారాన్ని ఎల్లప్పుడూ సురక్షితమైన స్వర్గధామంగా భావిస్తారు. అందుకే వ్యక్తులు, సంస్థలు స్టాక్ మార్కెట్ తిరోగమనం కంటే బంగారంపై నమ్మకం ఉంచుతున్నారు. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, డబ్బు విలువ తగ్గడం ప్రారంభమవుతుంది. అందువల్ల, పెట్టుబడిదారులు తమ డబ్బును బంగారం వంటి స్థిరమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడతారు. తద్వారా వారి పొదుపు విలువ తగ్గదు. అందుకే బంగారం డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది.

## కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు

మరో ప్రధాన కారణం కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు. గత కొన్ని సంవత్సరాలుగా, అనేక దేశాలలోని కేంద్ర బ్యాంకులు తమ విదేశీ మారక నిల్వలలో బంగారం వాటాను పెంచుకున్నాయి. ఉదాహరణకు, భారతదేశం, చైనా, రష్యా, టర్కీ వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి నిరంతరం టన్ను చొప్పున బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి.

## ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలు

మూడవ కారణం ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, చైనా-అమెరికా వాణిజ్య వివాదం, మధ్యప్రాచ్యంలో అస్థిరత వంటి పరిస్థితులు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బంగారం వైపు మళ్లించాయి. 2008 మాంద్యం అయినా లేదా 2020 మహమ్మారి అయినా, ప్రతి సంక్షోభ సమయంలోనూ బంగారం సురక్షితమైన పెట్టుబడిగా నిరూపించబడిందని చరిత్ర చూపిస్తుంది.

## గతంలో ఏం జరిగిందంటే?

ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆర్థిక మాంద్యం ముంచుకొచ్చినప్పుడు, యుద్ధాలు జరిగినప్పుడు బంగారం ధర పెరుగుతున్నట్లు చరిత్ర చెబుతోంది. సంక్షోభ పరిస్థితుల్లో ఆర్థిక భద్రత కోసం కేంద్ర బ్యాంకులు, సంస్థలు బంగారం కొని నిల్వ చేస్తాయి. ధర పెరిగి, లాభపడొచ్చని మదుపరులు బంగారంపై భారీగా పెట్టుబడులు పెడతారు. దీంతో ఒక్కసారిగా ధర పెరిగిపోతోంది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత, 1970లో చమురు సంక్షోభం తలెత్తినప్పుడు, 2008లో ఆర్థిక మాంద్యం ముంచుకొచ్చినప్పుడు, కొవిడ్-19 ముప్పు తలెత్తినప్పుడు ఇలానే బంగారం ధర అమాంతం పెరిగింది. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో బంగారం ధర పరుగు మొదలైంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టాక, తీసుకున్న చర్యలతో ఆ పరుగు వేగవంతమైంది. 'డీ-డాలరైజేషన్ థీమ్' ప్రాచుర్యం పొందడమూ పసిడి ధరల పెరుగుదలకు ఒక కారణంగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కరెన్సీగా డాలర్ స్థానంలో సొంత కరెన్సీలను ప్రోత్సహించడానికి వివిధ దేశాలు ప్రయత్నించడాన్ని డీ-డాలరైజేషన్‌గా పరిగణిస్తున్నారు. ఈ విధానం అమలుకు చైనా, రష్యా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వాణిజ్య విధానాలు, విధిస్తున్న సుంకాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రస్థానంపై సందేహాలు తలెత్తుతున్నాయి. దీంతో పలు దేశాలు డాలర్ బాండ్లలో పెట్టుబడులు తగ్గించి, బంగారం నిల్వలు పెంచుకుంటున్నాయి. ఇటీవల వివిధ కేంద్ర బ్యాంకులు బంగారం కొనుగోళ్లు అధికం చేయడానికి ఇదే ప్రధాన కారణం. మదుపర్లు డిజిటల్ పద్ధతుల్లో పెట్టుబడులు పెడుతున్నందున బంగారానికి అనూహ్య గిరాకీ ఏర్పడి, ధర పరుగులు తీస్తోంది.

## ధర తగ్గుతుందా?

- గతంలో బంగారం ధర అనూహ్యంగా పెరిగిన సందర్భాలను విశ్లేషిస్తే, పెరుగుదలకు తావిచ్చిన కారణాలు సద్దుమణిగాక.. దిగివచ్చింది. ఇప్పుడూ అది వర్తిస్తుంది. కానీ.. ధర ఇప్పటికిప్పుడు తగ్గుతుందని ఆర్థిక, పెట్టుబడి నిపుణులు చెప్పడం లేదు. ప్రస్తుత తరుణంలో పసిడి ధర తగ్గాలంటే
- 'రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆగాలి.
- ట్రంప్ సుంకాల ప్రభావం, ఆర్థిక మందగమనం విషయంలో స్పష్టత రావాలి.
- డాలర్ బలపడాలి.
- వడ్డీరేట్లు పెరగాలి. ద్రవ్యోల్బణం తగ్గాలి. కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనడం తగ్గించాలి' అని నిపుణులు పేర్కొంటున్నారు.



### నిబద్ధతతో పోలీసులు విధులు
# నిర్వహించాలి

**మట్టెవాడ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఏఎస్పీ శుభం ప్రకాష్**

**వరంగల్ మహా;** వరంగల్ సబ్ డివిజన్ యొక్క అసిస్టెంట్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) శుభం ప్రకాష్ నగరాలే, ఐపీఎస్ బుధవారం మధ్యాహ్నం మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణం, స్టేషన్ కు సంబంధించిన రికార్డులు, కేసు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టత పై పలు సూచనలతో పాటు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ కు వచ్చిన ప్రజలకు చట్ట ప్రకారంగా న్యాయం చేయాలని బాధితులకు మెరుగైన సేవలు అందిస్తూ విధి నిర్వహణలో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రతతో పాటు పచ్చదనంగా ఉండాలని ఏఎస్పి శుభమ్ ప్రకాష్ తో కలిసి ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు మొక్కను నాటారు.

### సమన్వయంతో పనిచేసి జాతరను
# విజయవంతం చేద్దాం

**మొక్కలు చెల్లించుకున్న వరంగల్ సీపీ.. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ హన్మకొండ మహా ;** పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేసి మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ను విజయవంతం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. జనవరి చివరి వారంలో ప్రారంభమయ్యే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర వరంగల్ పోలీస్ కమిషనర్ కు ట్రాఫిక్ బందోబస్త్ బాధ్యతలు అప్పగించడంతో, వరంగల్ సీపీ కమిషనరేట్ కు చెందిన డిసిపి, అదనపు డిసిపి ఏసీపీ లతో హన్మకొండ జిల్లా కేంద్రం నుండి జాతర జరిగే ప్రదేశం అలాగే ప్రధాన రోడ్డు మార్గాన్ని సీపీ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ మార్గం లో వాహన పార్కింగ్, హోల్డింగ్, ట్రాఫిక్ సమస్య లు తలెత్తే ప్రదేశాల్లో బందోబస్త్ ఏర్పాటు పై సీపీ క్షేత్ర స్థాయిలో సమీక్షా జరిపారు.



అనంతరం సీపీ గట్టమ్మ గుట్ట వద్ద ఆర్టీసీ బస్సు లు, ప్రైవేట్ వాహనాల పార్కింగ్ ప్రదేశాలతో పాటు, జాతర ప్రదేశాన్ని చేరుకునే మార్గాలు, అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల పై సీపీ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్న సీపీ**

బుధవారం ఉదయం మొదట గట్టమ్మ ను దర్శించుకున్న అనంతరం మేడారం కు చేరుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ సమ్మక్క సారలమ్మ లను దర్శించుకొని బెల్లం (బంగారం) సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. సీపీ వెంట ములుగు ఎస్పీ సుధీర్ కేకన్, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, ములుగు ఓ.ఎస్. డి శివం ఉపాధ్యాయ, అదనపు డిసిపి ప్రభాకర్, ఏసీపీలు జితేందర్ రెడ్డి, సత్యనారాయణ, సతీష్ బాబు, ములుగు డి. ఎస్పీ రవీందర్ తో ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## అంధుల పాఠశాలకు నిత్యవసరాల పంపిణీ

**డాక్టర్ హరి రమాదేవి**



**వరంగల్ మహా;** బీఆరెస్ సీనియర్ నాయకురాలు, వి కేర్ సొసైటీ ఫర్ సోషల్ సర్వీసెస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ హరి రమాదేవి తో పాటు సంస్థ ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఆకుల భాగ్యలక్ష్మి వారి కుటుంబ సభ్యులతో కలిసి తమ తండ్రి కీ.శే. శామంతుల కిష్టయ్య 24వ వర్ధంతిని వరంగల్ ఆటోనగర్ సమీపంలోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలోని విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు, పండ్లు అందజేయడంతో పాటు వారికి వారం రోజుల సరిపడ భోజనావసరాలకు కావలసిన బియ్యం, పప్పులు మొదలైన నిత్యవసర సరుకులను పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు హరి రమేష్ బాబు, కుటుంబ సభ్యులు డాక్టర్ శ్రీజ, డాక్టర్ శ్రీనిధి, రాంకిషోర్ లతో బాటు గుళ్ళపల్లి సంధ్య పాఠశాల నిర్వాహకుడు మణికంఠ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా;** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ లో ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం (డిస్ట్రిక్ రోడ్ సేఫ్టీ కమిటీ డి ఆర్ ఎస్ సి ) నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల బ్లాక్ స్పాట్స్ ని గుర్తించి ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై, ప్రమాదాల నివారణకు సైన్ బోర్డులు ఏర్పాటు జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి, గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాల అమలు, ఎన్ హెచ్ హైవే పై అందుబాటులో ఉన్న పెట్రోలింగ్ వెహికల్స్, ఇప్పటివరకు ఎన్ని ఓవర్ లోడ్ వాహనాల పై కేసుల నమోదు, ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేయడం వంటి తదితర రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలను సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న వరంగల్ ఖమ్మం హై వే, ఇతర ప్రాంతాలు, ప్రమాదాల నివారణ కు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. గతంలో సమావేశంలో గుర్తించిన 17 బ్లాక్ స్పార్ట్స్ పై తీసుకొన్న చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ ను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. హైవే రోడ్ల పైన స్పీడ్ బ్రేకర్స్ అలాగే, మూల మలుపుల



వద్ద హెచ్చరిక బోర్డ్స్ ఏర్పాటు చేయించాలని అన్నారు. టూ విల్లర్ పై వెళ్ళుటకు రోడ్లకు ఇరు వైపుల మార్క్స్ ను తరచూ పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫోర్త్ లైన్స్ రోడ్స్ ఉన్నచోట్ల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా క్యాష్ బెరియర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో వాహనాల వేగాన్ని నియంత్రించుటకు డబుల్స్ స్టిక్స్ ను ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. 18 సంవత్సరాల లోపు పిల్లల డ్రైవింగ్ చేయకుండా చూడాలని, హైవేలలో చీకటి వల్ల ప్రమాదాలు కలిగే అవకాశం ఉన్నందున సరైన లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మేడారం జాతర సమీపిస్తున్న దృష్ట్యా రోడ్లు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని, జిల్లా పరిధిలోనూ మరమ్మత్తు పనులు చేయించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి , ఆర్ అండ్ బి అధికారి రాజేందర్, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి శోభన్ బాబు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఇజ్జగిరి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హిందూ ఆలయాల జోలికి వస్తే ఊరుకోం

- అక్రమ నిర్మాణాలు వదిలేసి ఆలయాలను కూల్చడం సరి కాదు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- కూల్చివేతపై బల్దియా కమిషనర్ కు వినతిపత్రం అందజేత

**వరంగల్, మహా;** వరంగల్ జిల్లాలో హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హెచ్చరించారు. బుధవారం పైడిపెల్లిలో మైసమ్మ ఆలయం కూల్చివేత పై జిడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి ని వారి కార్యాలయంలో కలిసి వారికి వినతి పత్రం అందజేసి అక్కడ జరిగిన వాస్తవాలను వివరించి గుడి కూల్చివేత పై అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా కార్పొరేషన్ నిధులతోనే ఆలయ పునః నిర్మాణం తక్షణమే నిర్మించాలని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డిమాండ్ చేయడం జరిగింది. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ మాట్లాడుతూ.. చారిత్రక ఓరుగల్లు నగరంలో ఎన్నో అక్రమ నిర్మాణాలు, ఎఫ్టిఎల్ లో కట్టడాలు, నాలా కబ్జాలను పట్టించుకోని మున్సిపల్ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు మైసమ్మ ఆలయాన్ని కూల్చడంలో మాత్రం అత్యుత్సాహన్ని చూపించారని ఎద్దేవా చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై వారిచ్చే ముడుపులకు ఆశపడి పోలీసుల సాయంతో ఆలయాన్ని కూల్చివేశారని మండిపడ్డారు. ఆలయ నిర్మాణం రోడ్డు పక్కనే ఉన్నా.. కుడా లే ఔట్ల లో కూడా ఉన్నా కుట్ర చేసి కూల్చారని ఫైర్ అయ్యారు. ఓరు



గల్లులో ఇలా హిందువుల మనోభావాలు దెబ్బతీసే చర్యలును ఉపక్షించమని, ఒక మతాన్ని అంటిపెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇలాంటి వాటిని ప్రోత్సహించొద్దని సూచించారు. భవిష్యత్ లో ఇలాంటి దాడులకు పాల్పడితే ఉరికిచ్చి ఉరికిచ్చి కొడుతామని గంట రవి కుమార్ హెచ్చరించారు. ముందస్తు నోటీసులు ఇచ్చామన్న అధికారులు అవి చెట్లకు, గోడలకు అంటించి నోటీసులు ఇచ్చామని చేతులు దులుపుకుంటె ఎలా అని ప్రశ్నించారు. అసలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సోయి ఉందా..? అని గ్రేటర్ పరిధిలో ఎన్నో అక్రమ నిర్మాణాలు రోజుకు కొన్ని పుట్టగొడుగుల్ల నిర్మాణాలు పుట్టుకస్తున్నాయని, నాలాల కబ్జాలు జరుగుతున్నాయని, రోడ్ల పై దర్గాలు కడుతున్నారని, కొన్నిచోట్ల రోడ్లే కబ్జా చేస్తున్నారని అవి కార్పొరేషన్ అధికారులకు కనిపించడం లేదా అని గంట రవికుమార్ ప్రశ్నించారు. రోడ్ల పక్కన ఉన్న హిందు దేవాలయాలే కనిపిస్తున్నాయా అంటూ మొండిపడ్డారు. కార్పొరేషన్ శాఖ అధికారులంతా ఒకసారి ఆలోచన చేయాలని మీరు హిందువులు కాదా అని మీ ఆలోచన విధానం మార్చుకోకపోతే హిందువుల నుంచి దాడులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, హిందూ బంధువులు, పైడిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలి

### హనుమకొండ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ వై.వి. గణేష్

**హన్మకొండ మహా;** వినియోగదారుల హక్కుల పై అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ వై. వి. గణేష్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌర సరఫరాలు, తూనికలు కొలతలు శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆయా శాఖల అధికారులు తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్ వై. వి. గణేష్ మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు తమ హక్కులను గురించి తెలుసుకుని మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వినియోగదారులు ఎక్కువగా మోసపూరిత తూకాలతో నష్టపోవడం జరుగుతుందని అందుకు గాను తూనికలు కొలతల శాఖ తనిఖీలు నిర్వహించాలన్నారు. తప్పనిసరిగా ప్రతి సంవత్సరం తూకాల రాళ్లకు స్టాంపింగ్ వేయడం జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారుడు వస్తువులు కొనుగోలు చేసినప్పుడు అందుకు సంబంధించిన బిల్లులు పొందే విధంగా వినియోగదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా మోసాలకు గురి అయినప్పుడు సంబంధిత రసీదులను సమర్పించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు జిల్లా స్థాయి



మొదలుకొని గ్రామస్థాయి వరకు వినియోగదారులకు జరుగుతున్న మోసాలపై ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు వినియోగదారుల ఫోరమ్ అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. జిల్లా వినియోగదారుల ఫోరం సూచనలను పరిగణనలోకి తీసుకొని వ్యవస్థను బలోపేతం చేయడానికి గాను జిల్లా వినియోగదారుల ఫోరం పునరుద్ధించుటకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సాంకేతిక, వినూత్న పద్ధతులను ఏకీకృతం చేసి వినియోగదారుల కేసులు పరిష్కారాన్ని వేగవంతం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి వాజిద్ అలీ, తూనికలు కొలతల శాఖ అధికారి వెంకటేష్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం అధ్యక్షులు రతన్ సింగ్ ఠాగూర్, కార్యదర్శి సూరజ్ తో పాటు ఓరుగల్లు వినియోగదారుల ఫోరం సభ్యులు దండు యుగేందర్, బండ వివేకానంద, శోభ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు రవాణా ఏర్పాట్లపై సమీక్షా

- భక్తుల రవాణా సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు చేయాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** జనవరి 28 నుండి 31 వరకు ములుగు జిల్లా మేడారం లో నిర్వహించనున్న శ్రీ సమ్మక్క సాలమ్మ జాతర నేపథ్యంలో వరంగల్ జిల్లాలో భక్తుల రవాణా సౌకర్యార్థం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమావేశంలో మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర, నల్లబెల్లి మద్ది మేడారం జాతర ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముందస్తు ప్రణాళికతో సమర్ధవంతంగా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గత మేడారం అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం మేడారం జాతర సందర్భంగా భక్తుల



రాకపోకలకు అనువుగా తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన చేపట్టారు. లక్ష్మీపురం పరిధిలోని ఎస్ఎస్ఎం క్లబ్, ఓ సిటీ గ్రౌండ్ లను సందర్శించి, బస్టాండ్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి రాజేందర్, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈ సునీత, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఇజ్జగిరి, ఆర్డీఓ సుమా, డిపిఓ కల్పన, జిల్లా ఫైర్ అధికారి రెడ్డి, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్ కుడా పిఓ అజిత్ రెడ్డి, పోలీస్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



### నగరాభివృద్ధికి అంతర్గత రోడ్లు
# అత్యంత కీలకం

**వార్షికోత్సవాన్ని జరుపుకున్న స్థానిక ప్రజలు**

**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని 28 డివిజన్ పిన్నవారి వీధిలో స్థానిక ప్రజల 40 ఏళ్ల స్వప్నం అయిన అంతర్గత రోడ్ల ను నిర్మించి సంవత్సరం అవుతున్న సందర్భంగా ఈ సంతోషాన్ని పిన్న వారి వీధి స్థానిక ప్రజలందరూ కలిసి డివిజన్ కార్పొరేటర్ గందే కల్పన నవీన్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ చొరవతో ఎంతో చక్కని రోడ్లు వేయడం ఆనందంగా ఉందని పిన్నవారి వీధిలో ప్రజలందరూ కలిసి స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్ తో కేక్ కటింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో చకిలం సతీష్, పిన్న నారాయణ, శ్రీ మాత శ్రీను, సత్యనారాయణ, పాండే, పోకల రాము, మహారాజ్, శివకుమార్, కేదాశి కిరణ్, చకిలం ఏకాంబరం, జి సంతోష్, ఆర్ రాజు కే కళ్యాణ్, భార్గవరామ్ బాదం వెంకటేశ్వర్లు, రాజేశ్వరరావు, తోట కేదారి, తదితరులు పాల్గొన్నారు.

### వస్తువు ధర తెలుసుకునే హక్కు
# వినియోగదారునికి వుంటుంది

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదాద్రి భువనగిరి, మహా:** నాణ్యమైన వస్తువులు, పరిమాణం, వస్తువుల ధర గురించి తెలుసుకునే హక్కు ప్రతి వినియోగదారుడుకి ఉంటుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరిగింది ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వినియోగదారుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని, రక్షణ, కల్తీవస్తువులనుఅధిగమించడానికి చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యావంతులకే కాక సామాన్యులకు కూడా సరైన న్యాయం జరిగినప్పుడే వినియోగదారుల దినోత్సవానికి సార్ధకత అని తెలిపారు. నాణ్యమైన వస్తువు సేవలను పొందడం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని అన్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఉండే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందే విధంగా వినియోగదారుల హక్కుల సంఘాలు వారికి అండగా నిలబడి సేవలందించాలని కోరారు. నిత్య జీవితంలో ఆహారం, మెడిసిన్ ఒక భాగం కాబట్టి కఠినమైన శిక్షలు ఉంటేనే న్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారి సమాజంలో కల్తీ లేని సమాజంగా ఉండేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో హాస్పిటల్స్, మెడికల్ షాపులు, ఎరువుల షాపులు,



హోటల్స్ , హాస్టల్స్, తదితర షాపులలో సంబంధిత అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీలలో సర్పంచ్ లకు అవగాహన కల్పించి ఫర్టిలైజర్స్, తదితర షాపులను తనిఖీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో జిల్లా యంత్రాంగం విస్తృతంగా తనిఖీలు చేపట్టనున్నారని కల్తీ లేని సమాజానికి శ్రీకారం చుట్టాలన్నారు. వచ్చే నెలలో సంబంధిత ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామం నుండి జిల్లా స్థాయి వరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ వినియోగదారులు ఏదైనా వస్తువు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తీసుకోవాలని, తద్వారా తమ హక్కులను పరిరక్షించుకోవచ్చని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉన్న సేవల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారి హరికృష్ణ, ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి, జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, జిల్లా మెట్రాలజీ అధికారి వెంకటేశ్వర్లు, వినియోగదారుల ఫోరం సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### నుస్తులాపూర్ గ్రామాన్ని
## ఆదర్శంగా తీర్చిదిద్దండి



**కరీంనగర్ మహా :** నుస్తులాపూర్ గ్రామాన్ని సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలపాలని సిపిఐ మాజీ శాసనసభ పక్ష నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆకాంక్షించారు. తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావు అత్యధిక మెజార్టీతో ప్రజల మనసును గెలుచుకోవడం అభినందనీయ మని పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో ఇటీవల సర్పంచ్ గా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ తుమ్మనపల్లి సంధ్య శ్రీనివాసరావును మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో శ్రీనివాసరావు ఉప సర్పంచ్ గా, సర్పంచ్ గా, ఎంపిటిసిగా వైస్ ఎంపీపీగా పనిచేసి ప్రజల మెప్పు పొందారని గుర్తు చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ కష్ట సుఖాల్లో వెన్నంటే ఉండడం శ్రీనివాసరావుకు కలిసి వచ్చిందన్నారు. ఇదే స్పూర్తితో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారికి చాడ వెంకటరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్ సదాశివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

**బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**హన్మకొండ మహా ;** పెన్షనరీ బెనిఫిట్స్ ఆర్థిక ప్రయోజనాలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెన్షనర్ల ఉసురు తీస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మండిపడ్డారు. రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్ల ఆధ్వర్యంలో హనుమకొండ ఏకశిలా పార్కు వద్ద చేపట్టిన నిరాహార దీక్షలో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ వారికి మద్దతుగా పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు పెన్షనర్ల పట్ల పక్షపాత ధోరణి ఇచ్చిన హామీలు మరిచి మొండి చేయి చూపటం ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడంపై మండిపడ్డారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో దాదాపుగా 16000 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులుగా ప్రభుత్వానికి ప్రజలకు 35 సంవత్సరాల కు పైగా ఎన్నో సేవలు చేసి రిటైర్ అయి 22 నెలలు గడిచినా కూడా ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల డబ్బులు, రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం చాలా బాధాకరమని వారికి రావాల్సిన డబ్బు బకాయిలను మాత్రం ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించడం లేదు. ఈరోజు వరకు దాదాపు 35 మంది ఉద్యోగ విరమణ పొందిన వారు రిటైర్మెంట్ బకాయిలు ప్రభుత్వము నుండి రాకపోవడం వల్ల



ఆర్థికపరమైన సమస్యల వల్ల వైద్యం చేయించుకోవడానికి అవసరమైన డబ్బులు లేకపోవడం వల్ల అనేక రకాల ఇతర సమస్యలతో కుటుంబ బాధ్యతలను ఎలా కొనసాగించాలని అర్థంకాని బెంగతో మానసిక ఆవేదనకు గురై మరణించడం జరిగిందని అయినప్పటికీ కూడా ప్రభుత్వం నుండి కనీస స్పందన కూడా లేదని ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి వారికి వచ్చే బకాయిలు రాబట్టుకోవడం కొరకు మరింత ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం కొరకు తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ జేఏసీ కమిటీ, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బకాయిల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏకశిల పార్కు వద్ద నిర్వహించిన నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొని వారికి మద్దతు ఇచ్చి, బిజెపి శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి వచ్చే అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడే విధంగా కృషి చేస్తారని చెప్పడం జరిగింది.



### కలెక్టరేట్ ముందు
# పెన్షనర్లు ధర్నా

**భువనగిరి, మహా:** మార్చి 2024 తదుపరి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు బకాయిలు వెంటనే డిమాండ్ చేస్తూ పదవి విరమణ ఉద్యోగులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం నిరాహారదీక్ష, ధర్నా నిర్వహించారు... పెన్షనర్స్ ల ఆత్మహత్యలు ఆపాలని, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని నినాదించారు ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిప్రత్రం అందించారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మంద సోమరాజు ,పూల నాగయ్య, కృష్ణకళ, మోట సత్తయ్య, కిషోర్, నిర్మల, మహేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.



## పల్లె ధవాఖాన సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ఆలేరు, మహా:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఎం ఎల్ ఎచ్ పి, ఆశాకి షోకాజ్ నోటీసులు జారీకి ఆదేశాలు జారీ చేశారు జిల్లా కలెక్టర్ హనుమంతరావు యాదాద్రి భువనగిరిజిల్లా ఆలేరు మండలం రాఘవపూర్ గ్రామంలో పల్లె దవాఖానను బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీ సమయంలో పల్లె దవాఖాన లో సిబ్బంది ఎవరు అందుబాటులో లేక పోవడం తో, ఎం ఎల్ ఎచ్ పి సరిత, ఆశ కార్యకర్త కి షోకాజ్ నోటీసు జారీ చేయమని జిల్లా వైద్యాధికారి కి ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్. చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకి సిబ్బంది అందుబాటులో లేకపోవడం పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వలిగొండ సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మారగొని సురేష్ గౌడ్

**వలిగొండ మహా :** వలిగొండ నూతన సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మారగోని సురేష్ గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మారగోని లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు



## అమ్మవారి పాదాలకై వెండి బహుకరించిన భక్తులు

**వరంగల్ మహా;** వరంగల్ లోని 34 డివిజన్, శివనగర్ శ్రీ ధన మైసమ్మ దేవాలయం, మెట్ల బావి అమ్మవారికి 500 గ్రామాల వెండితో వెండి పాదాలు చేయించడం కోసం ఆలయ అధ్యక్షులు సన్నాహాలు చేస్తున్నారు ఇందుకోసం బుధవారం శివనగర్ కు చెందిన రుద్రోజు సదానందం రేణుక పుణ్య దంపతులు అమ్మవారి పూజలో పాల్గొని అమ్మవారికి వెండి పాదాలకు 50 గ్రాముల ( 5 తులాలు ) వెండికి 10,250 రూపాయలను ఆలయ అధ్యక్షులు తోట బాబన్న కు అందజేయడం జరిగింది. అనంతరం తోట బాబన్న అమ్మవారి చిత్రపటం తో పాటు కండువాతో ఆ పుణ్య దంపతులను సన్మానించడం జరిగిందని ఆలయ అధ్యక్షులు తోట సంధ్య బాబన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రోజు సింధుజ ,వెంకటేష్, రశ్మిత జితేంద్ర, రేణుక, అవ్యక్త్ ప్రశాంత్



తో పాటు వారి కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు వెంకన్న పాల్గొన్నారు.

# స్టాక్, ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలి

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా
- మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి



**మొయినాబాద్ మహా:** ఎరువుల దుకాణాల్లో తప్పనిసరిగా స్టాక్, ధరల పట్టికను ప్రదర్శించి నిత్యం నవీకరించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దుకాణదారులను అదేశించారు. బుధవారం ఆమె మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ల వద్ద నిర్వహిస్తున్న బుక్ బ్యాలెన్స్, గ్రౌండ్ బ్యాలెన్స్, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనం తరం ఆమె మాట్లాడుతూ ఎరువులను ఎంఆర్పీ ధరలకే విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే కఠిన చర్యలు, శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఎరువు విక్రయానికి రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. త్వరలోనే కొత్త ఎరువుల యాప్ ప్రారంభం కానుందని, ప్రస్తుతం దానికి సంబందించిన ట్రయల్స్ కొనసాగుతున్నాయని తెలిపారు. ఎరువులు పొందేందుకు ఈ యాప్ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. వ్యవసాయ శాఖ చేపడుతున్న ఈ కొత్త విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని.. డీలర్లు కూడా సహకరించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి అనురాధ, సిబ్బంది ఉన్నారు.

### ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం జాయింట్ సెక్రటరీగా

# ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్




**ఆమనగల్లు, మహా:** తెలంగాణ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారుల తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం జాయింట్ సెక్రటరీగా అమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్య నాయక్ చౌహాన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఈనెల హైదరాబాద్ నాంపల్లి లోని టీఎన్జీవో భవన్ లో తెలంగాణ ప్రొబిషన్ ఎక్సైజ్ అధికారుల తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం రాష్ట్రస్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఎంబి కృష్ణ యాదవ్, సహా ఎన్నికల అధికారికి ఏ.రామారావుల పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహించారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ అధికారుల టిజిఓ ఫోరం రాష్ట్ర అధ్యక్షులుగా టీ లక్ష్మణ్ గౌడ్, కార్యదర్శులుగా ఎంపీఆర్ చంద్రశేఖర రావు, అసోసియేట్ సభ్యులు, ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్ లు ఎన్నుకున్నారు, అందులో భాగంగా ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరైన ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ ఖురేసి,అదనపు కమిషనర్ సురేష్ రాథోడ్ ల సమక్షంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి తో పాటు జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైన బాధ్యనాథ్ చౌహన్ ప్రమాణ స్వీకారం చేశారు.సందర్భంగా నియామక పత్రాన్ని అందించి శాలువాలతో సత్కరించి అభినందించారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో జాయింట్ సెక్రెటరీ సీఐ బద్యనాథ్ చౌహన్ ఎస్సై కృష్ణ ప్రసాద్, సిబ్బంది శంకర్, లోక్య, ఉపేందర్, దశరథ్, చిన్న గౌడ్, శ్రీజలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాలాజీని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



**మొయినాబాద్ మహా:** చిలుకూరు బాలాజీ వెంకటేశ్వర స్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చ్ అధ్యక్షుడు ఆనంద్లు దర్శించుకున్నారు. బుధవారం ఉదయం చిలుకూరుకు వచ్చిన వారిని మండల బీజేవైఎం నాయకుడు కొండా జగన్ మోహన్రెడ్డి స్వాగతం పలికి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలుకూరు బాలాజీని దర్శిం చుకోవడం సంతోషంగా ఉందని.. చిలుకూరు వేదికగా ప్రదాన అర్చకుడు సీఎస్. రంగరాజన్ హిందువుల ఐక్యత కోసం చేస్తున్న అనేక కార్యక్రమాలు బాగున్నాయని తెలిపారు. అనంతరం వారికి చిలుకూరు ఆలయ విశిష్టతను వివరించారు. వారి వెంట భజ్ంగ్ దళ్ సభ్యుడు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# ఏసుక్రీస్తు భోదనలు సర్వ మానవళికి ఆదర్శం



**మొయినాబాద్ మహా:** ఏసుక్రీస్తు భోదనలు సర్వ మానవళికి ఆదర్శమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. రవీందర్ తెలిపారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు పరిధిలో ఉన్న చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య యం. రవీందర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులు, విద్యార్థినీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం రిజిస్టార్ రవీందర్ మాట్లాడుతూ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు భోదనలు సర్వ మానవళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్మస్ పండుగ ప్రధాన సందేశమని పేర్కొన్నారు. ఈ పండుగను క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంతవాతవరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముం దుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫౌండర్ డాక్టర్ పురుషోత్తం రెడ్డి, డైరెక్టర్ అండ్ చీఫ్ ఆడ్డినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్విక రెడ్డి యూనివర్సిటీ సిబ్బందికి మరియు విద్యార్థులకు క్రిస్మస్ శుభాంకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ శంకర్ం గం, డీన్ క్రిస్టోఫర్, అనురాధ, రాజు, కవిత, ప్రత్యుషరెడ్డి, కుమార స్వామి, సునీత, ఆసిస్టెంట్ రిజిస్టార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రగతికి కృషి చేస్తా...



**మొయినాబాద్ మహా:** గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలు అందేలా చూస్తానని బాకారం జాగీర్ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని బాకారం జాగీర్ గ్రామంలోని మొదటి, 5వ వారుల్డలో ఆ వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్రెడ్డి, ఉపేందర్ యాదవ్లు తమ సొంత నిధులతో వాహనాల వేగ నియంత్రణ కోసం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించగా సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ పాల్గొని పనులను ప్రారంభించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యులు తమ సొంత నిధులతో తమతమ వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. బాకారం జాగీర్ గ్రామంలో మౌలిక వసతులను మెరుగు పర్చడంతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పిం చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. బాకారం గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. దశలవారిగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకు ందామని అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుబాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు నాగేశ్వర్రెడ్డి, ఉపేందర్ యాదవ్, అమృత ఎల్లయ్య, నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్, కృష్ణమాదిగ, కృష్ణారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, గ్రామస్థులు ఉన్నారు.

# ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు

మంచాల మండలం ఆగపల్లి

## 191 సర్వేనెంబర్

- ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వెంచర్
- రోడ్డు వేసినా చోద్యం చూసిన అధికారులు...!
- ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆగపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమి 191 సర్వే నెంబర్లో ప్రైవేట్ వ్యక్తులు కంగ్రాట్ చేసిన భూమిలో ప్రభుత్వ సూచక బోర్డు.. మంచాల మండలం ఆగపల్లి గ్రామం సర్వేనెంబర్ 191 లోగల ప్రభుత్వ భూమిలో ఓ ప్రైవేట్ వెంచర్ యజమానులు, కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డు వేసే ప్రయత్నంలో భాగంగా గత సంవత్సరంలో మంచాల మండల రెవెన్యూ సిబ్బంది స్థానికుల సమాచారం మేరకు అక్కడ ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపి సూచిక బోర్డు పెట్టారు. కొద్దిరోజుల తర్వాత అక్కడినుండి ఆ బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు తీసేసినట్లు రెవెన్యూ సిబ్బంది తెలుసుకున్నారు. బోర్డు ఏర్పాటు చేసిన స్థలంలో రోడ్డు పనులు కూడా పూర్తయ్యాయని గమనించిన అధికారులు ఎట్టకేలకు కళ్ళు తెరుచుకుని బుధవారం కొత్త బోర్డును ఏర్పాటు చేశారు. వెంచర్ యజమానులపై, రెవెన్యూ అధికారుల పనితీరుపై పలుమార్లు స్థానికులు కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్: పద్మజ సింగ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్ గా ప్రముఖ పారిశ్రామిక వేత పద్మజ సింగ్ అవార్డు అందుకున్నారు. హైటెక్ సిటీ నోవోటల్ హోటల్లో హైబీజ్ టీవీ ఆధ్వర్యంలో బుధవారం ఉత్తమ పారిశ్రామిక వేత్తల అవార్డులు ప్రధానం చేయడం జరిగింది. ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్ విభాగం తరపున ప్రముఖ పారిశ్రామిక వేత ది లోటస్ స్టూడియో అధినేత్రి పద్మజ సింగ్, హై బిజ్ టివి అధినేత రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఇంటీరియల్ డిజైన్ అవార్డు అందుకున్నారు. గత 22 సంవత్సరాలుగా తమ కంపెనీ అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడంతో తమ మీద మరింత బాధ్యత పెరిగిందని పద్మజ సింగ్ తెలిపారు. అపార్ట్మెంట్ మరియు విల్లాస్ మరియు ఆఫీస్, హాస్పిటల్, జువెల్లరీ షోరూం, ఫామ్ హౌస్ లో ప్రత్యేకంగా పర్నిచర్ విభాగాలలో ది లోటస్ స్టూడియో సేవలను హైదరాబాదులో మరిన్ని బ్రాంచ్ లను త్వరలో ప్రారంభం చేస్తామన్నారు. అవార్డు వచ్చిన సందర్భంగా రాజ్ సింగ్, గౌతమ్, మానస పుష్ప గుచ్చం ఇచ్చి అభినందించారు.



## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన సీఈ

**ఆమనగల్లు, మహా:** తలకొండపల్లి మండల పరిధిలోని కర్కాస్ తండా సమీపంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని బుధవారం ప్రాజెక్టుల సీఈ శశిధర్ సందర్శించారు. 20 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టుకు అవసరమైన ఏర్పాట్లను ఆయన పరిశీలించి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సర్పంచ్ అనిత,ఉప సర్పంచ్ గోపాల్ నాయక్, మాజీ సర్పంచులు వెంకటరామిరెడ్డి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## ప్రత్యేక జోన్ ఏర్పడేంతవరకు జేఏసీ నాయకులతో కలిసి పని చేస్తాము

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి , కార్తీక్ రెడ్డి ని బుధవారం వారి నివాసంలో కలిశారు. శంషాబాద్ను చార్మినార్ జోన్లో కలపకుండా, శంషాబాద్ను ప్రత్యేక జోన్గా ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేసే వరకు జేఏసీ నాయకులతో ఉద్యమంలో ఉంటానని హామీ ఇవ్వడంతో భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



## పోస్ట్ ఆఫీస్ కాలనీలో చెట్ల తొలగింపు

**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని సర్పంచ్ రాయి కంటి బిక్షపతి చెప్పారు. బుధవారం పోస్ట్ ఆఫీస్ కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి పదో వార్డులో వీధిలైట్లు ఏర్పాటుచేయించారు. వార్డులో డ్రైనేజీ, త్రాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. వార్డుసభ్యుడు మంకీ మహేశ్, కార్యదర్శి అల్లాజీ,నాయకులు పాల్గొన్నారు.



## గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండల పరిధిలోని మేడిగడ్డ గ్రామ సమస్యలపై బుధవారం గ్రామ పాలకవర్గం కల్వకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు.అండర్ డ్రైనేజీ వాటర్ ట్యాంక్ సిసి రోడ్డు వెడల్పులో ఇల్లు కోల్పోతున్న వారికి నిధులు మంజూరు చేయాలని మేడిగడ్డ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఎమ్మెల్యే ను కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉప సర్పంచ్ విజయరాథోడ్ తెలిపారు.వినతి పత్రం అందజేసిన వారిలో జయేందర్,సీతా,కవితా,సీతారాం,భారత్, దేవేందర్,కావ్య, తావుర్య,తదితరులు పాల్గొన్నారు.

## ఈ సృష్టి మొత్తం ధర్మదేవతతో నడిపించబడుతుంది: పత్రీజీ

### ధ్యానులతో జనసంద్రంగా పిరమిడ్ ధ్యాన కేంద్రం




**అమనగల్లు, మహా:** కడ్తాల్ మండలం హనుమాస్పల్లి మహేశ్వర మహా పిరమిడ్లో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహా యాగం వేడుకలు నాల్గవ రోజు సంబరంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక అఖండ ధ్యానంలో వందలాది మంది పాల్గొనడంతో పిరమిడ్ ప్రాంగణం ధ్యానులచే జనసంద్రంగా మారింది. మాస్టర్లు ధ్యానం విశిష్టత, అవశ్యకతను వివరించారు.పత్రీజీ ధ్యాన మహాయాగంలో బ్రహ్మర్షి పత్రీజీ వీడియా ఆధ్యాత్మిక సందేశాలు ధ్యానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నాలుగో రోజు ధర్మదేవత అనే అంశంపై సందేశం విన్పించారు. ఈ సృష్టి మొత్తం ధర్మదేవతతో నడిపించబడుతుందని తెలిపారు. ధర్మాన్ని తెలుసుకున్న వారంత ధర్మదేవతగా తయారువుతారన్నారు. ఆధర్మాన్ని కొంత వరకు సహించడం కూడా ఒక ధర్మమని తెలిపారు. ధర్మదేవత కొంత వరకు ఆధర్మాన్ని సహిస్తుందని, అయితే మితిమీరితే శిక్షిస్తుందని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ ధర్మంగా జీవించాలని కోరారు. అలాగే ప్రయోగం అనే అంశం గురించి వివరించారు. ఏది కూడా గుడ్డిగా నమ్మకూడదని ప్రయోగం చేసి నమ్మాలని సూచించారు. ప్రయోగం,అనుభవం , వ్యక్త పరిచడం అనే మూడు ద్వారా మనం పురోగతి చెందుతామని, వికాసం చెందుతామని తెలిపారు.

**మనం దేనిపైన అయితే దృష్టి పెడుతామో ఆదే లభిస్తుంది - శ్రేయన్ దాగా**

ధ్యానంలో మనుసు ఎప్పడైతే శూన్యమవుతుందో మనని మనం తెలుసుకోగల్గుతామన్నారు బెంగళూరు పిరమిడ్ వ్యాలీ ఇంటర్నేషనల్ నిర్వాహకులు శ్రేయన్స్ దాగా. ప్రీతీజీ ధ్యాన మహాయాగంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడిన ఆయన మనం అనవసరమైన వాటిపైన దృష్టి పెడుతూ మన ఎనర్జీని కోల్పోతున్నామని తెలిపారు. మనం దేనిపైన అయితే దృష్టి పెడుతామో ఆదే జరుగుతుందని వివరించారు. కష్టాలు, సవాళ్లు వస్తే ఆందోళన చెందకుండా పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. మనం ఏదైన ఇతరుల నుంచి ఆశించి ఆది లభించకపోతే మనలో వ్యతిరేక ఆలోచనలు పెరుగుతాయని అందుకే ఎవరి నుంచి కూడా ఏది ఆశించకూడదని స్పష్టం చేసారు.

**సంగీతా కళాకారుడు సంజయ్ సింగికి సన్మాన కార్యక్రమం**

తన సంగీత నాధ్య ధ్యానంతో ధ్యానులను విశేషంగా అలరిస్తున్న సంగీతకళాకారుడు సంజయ్ సింగి బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ఫౌండర్ బుద్ధ సీఈవో క్వాంటమ్ ఫౌండేషన్ పి.చంద్రశేఖర్, మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు

**పీఎంసీ క్యాలెండర్, ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ**

పత్రీజీ ధ్యాన మహాయాగంలో పీఎంసీ న్యూఇయర్ క్యాలెండర్ ను మాస్టర్ శ్రేయన్స్ దాగా చేతుల మీదుగా ఆవిష్కరించారు. 8 సంవత్సరాల పీఎంసీ చరిత్రపై రూపొందించిన పీఎంసీ సావనీర్ ను ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. ధ్యానమాత్యత్వం పుస్తకం సంగీతకళాకారుడు సంజయ్ కింగి ఆవిష్కరించగా, పత్రీజీ ధ్యానమృతం పుస్తకాన్ని విజయభాస్కర్ రెడ్డి విడుదల చేసారు. బాలవికాస్ సాంగ్ ను ఆవిష్కరించారు.



## శంషాబాద్ ను ప్రత్యేక జోన్గా ప్రకటించాలి

సిపిఐ నాయకులు

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాచమల్ల యాదగిరి మండల కార్యదర్శి నర్ర గిరి, జిల్లా అధ్యక్షులు భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు ముదిరాజ్ సమావేశంలో పాల్గొన్నారు. సిపిఐనాయకులుమాట్లాడుతూశంషాబాద్నుప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలి. శంషాబాద్ లో నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రతిపాదికన డివిజన్లో పునర్విభజన జరగాలి. శంషాబాద్ ను చార్మినార్ జోన్ లో కలపడానికి శంషాబాద్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. జోన్ ఏర్పాటు చేయకపోతే సిపిఐ భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తుందన్నారు.




## జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కు జేఏసీ నాయకుల వినతులు..

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ పొలిటికల్ జేఏసీ నాయకులు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ని బుధవారం కలిసి శంషాబాద్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. శంషాబాద్ ను చార్మినార్ లో కలపటం వలన ప్రజలకు కలిగే ఇబ్బందులను కమిషనర్ కి జేఏసీ నాయకులు కోన్నమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి వివరించారు కమిషనర్ ఆర్ వి కర్ణన్ సానుకూలంగా స్పందిస్తూ జనాభా ప్రాతిపదికన డివిజన్లను మరోసారి పరిశీలించి తగు పరిష్కారం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాచమల్ల జయసింహ,పవిత్ర సాగర్, రమేష్ రాథోడ్, రాచమల్ల వర్ధన్, పెదిరిపాటి మురళి, గుంటి చరణ్, విటల్ గౌడ్, అరవింద్, శేఖర్,మనీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆసుపత్రి భవనం పూర్తి చేయాలని డిఈ ఆదేశాలు

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని టీజీఎంఎస్ఐడిసి డిఈ కోటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రి భవనాన్ని సందర్శించారు. ఫిబ్రవరి నెల చివరి నాటికి భవనం పూర్తి కావాలని కాంట్రాక్టర్కు గడువు ఉందని, అంతలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిఈ సూచించారు.



### జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పలు బస్తీలలో కార్పొరేటర్

## తోకల పర్యటన

**రాజేంద్రనగర్, మహా :** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, టాటా నగర్, ప్రగతి కాలనీ నుంచి వచ్చే డ్రైనేజ్ నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ప్రధానంగా సీవరేజ్ పైప్ లైన్ వ్యవస్థ స్ట్రాం నుంచి వచ్చే వాటర్ పైప్లైన్ వ్యవస్థ సరిగ్గా లేనందువల్ల దిగువ ప్రాంతలో నివసించే ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి తెలిపాటాంతో. రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జీఎం డబ్ల్యూఎస్, ఎస్ బి జిహెచ్ఎంసి అధికారులు బస్తీ వాసులతో కలిసి పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ రేజ్ పైప్ లైన్, వాటర్ పైప్ లైన్ సరిపడి మూల్యంతో నూతన పైప్లైన్ కోసం ప్రాధిపదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, రావుల భాస్కర్, అడికె జనార్ధన్, బాబు, రాము యాదవ్, పుందర్ యాదవ్, జై రామ్, దాస్, బిక్షపతి, ఎన్ను శంకర్ రెడ్డి, నరసింహ, మొగులైయ్య, జిహెచ్ఎంసి అధికారులు ఏఈ నర్సింహ మూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, లోక్ నాథ్, రఘు నాయక్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



# హౌసింగ్ మార్కెట్‌లో మందగమనం

దేశంలోని ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఊహించని మందగమనాన్ని ఎదుర్కొంటోంది. 2025 సంవత్సరం ముగింపు నాటికి భారతదేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో గృహ విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. ప్రాప్‌ఈక్విటీ అనే రియల్టీ సంస్థ వెల్లడించిన గణాంకాల ప్రకారం, 2025 నాలుగో త్రైమాసికంలో మొత్తం 98,019 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే 16 శాతం క్షీణత నమోదైంది. ముఖ్యంగా 2021 మూడో త్రైమాసికం తర్వాత నమోదైన అత్యల్ప విక్రయాల వాల్యూమ్ ఇదే కావడం గమనార్హం.

**నవీ ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌ల జోరు**

మొత్తం మార్కెట్ డీలా పడినా నవీ ముంబై, ఢిల్లీఎన్‌సీఆర్‌లు మాత్రం సానుకూల వృద్ధిని కనబరిచాయి. నవీ ముంబై అమ్మకాల్లో 13 శాతం వృద్ధిని నమోదు చేసి స్టార్ పర్ఫార్మర్‌గా నిలిచింది. ఢిల్లీఎన్‌సీఆర్ 4 శాతం వృద్ధితో నిలకడను చాటుకుంది. అయితే, మిగిలిన ఏడు ప్రధాన నగరాల్లో అమ్మకాలు ఏకంగా 31 శాతం వరకు పడిపోయాయి.

**ప్రధాన నగరాల్లో అమ్మకాల పరిస్థితి**

**బెంగళూరు:** 15,603 యూనిట్ల విక్రయాలతో గతంతో పోలిస్తే 7 శాతం క్షీణతను చూసింది.

**హైదరాబాద్:** ఇక్కడ కూడా అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి.

**పుణె:** అత్యధికంగా 31 శాతం క్షీణతతో 15,788 యూనిట్లకు పడిపోయింది.

**చెన్నై, కోల్‌కతా:** వరుసగా 16 శాతం వార్షిక క్షీణతను నమోదు చేశాయి.


**ప్రీమియం ఇళ్ల వైపు మొగ్గు**

అమ్మకాలు తగ్గినప్పటికీ డెవలపర్ల ఆదాయం, ఇళ్ల విలువల విషయంలో ఆసక్తికర మార్పు కనిపిస్తోంది. 2023లో 4.81 లక్షల ఇళ్ల లాంచ్ విలువ రూ.6.3 లక్షల కోట్లుగా ఉంటే, 2024లో లాంచ్ అయిన ఇళ్ల సంఖ్య (4.11 లక్షలు) తగ్గినప్పటికీ, వాటి విలువ మాత్రం రూ.6.8 లక్షల కోట్లకు పెరిగింది. ఇది కొనుగోలుదారులు, డెవలపర్లు లగ్జరీ/ప్రీమియం విభాగం వైపు మళ్లుతున్నారని స్పష్టం చేస్తోంది.

**తగ్గిన సరఫరా**

కేవలం అమ్మకాలే కాకుండా కొత్త ప్రాజెక్టుల ప్రారంభం కూడా ఈ త్రైమాసికంలో 10 శాతం తగ్గి 88,427 యూనిట్లకు చేరుకుంది. పెరిగిన నిర్మాణ వ్యయం, మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి వల్ల డెవలపర్లు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్‌లో కొత్త ప్రాజెక్ట్‌ల సరఫరాలో వరుసగా 16%, 7% మేర తగ్గుదల నమోదైంది.

# రోజుకు 10 గంటల పనికి ప్రభుత్వం ఆమోదం



హరియాణా రాష్ట్రంలో పని గంటలు, వ్యాపార నిబంధనల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 'హరియాణా షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సవరణ) బిల్లు, 2025'కు ఆమోదం లభించింది. 1958 నాటి పాత చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన ఈ బిల్లు ద్వారా రోజువారీ పని గంటలను పెంచడంతో పాటు పలు సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

**బిల్లులోని ముఖ్యాంశాలు**

ప్రస్తుతమున్న 9 గంటల పని పరిమితిని 10 గంటలకు పెంచారు. ఇందులో విశ్రాంతి సమయం కూడా కలిసి ఉంటుంది. అయితే వారానికి గరిష్ఠంగా 48 గంటల పని నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. త్రైమాసికానికి ఓవర్ టైమ్ పరిమితిని 50 గంటల నుంచి ఏకంగా 156 గంటలకు పెంచారు. వ్యాపార గరిష్ఠ డిమాండ్ సమయాల్లో సంస్థలకు ఇది వెసులుబాటు కల్పిస్తుంది. విరామం లేకుండా చేసే నిరంతర పని సమయాన్ని 5 గంటల నుంచి 6 గంటలకు పెంచారు. 20 కంటే తక్కువ మంది ఉద్యోగులున్న చిన్న సంస్థలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించింది. కేవలం వ్యాపార సమాచారాన్ని అందిస్తే సరిపోతుంది.

**వ్యాపార సౌలభ్యమా? బానిసత్వమా?**

ఈ బిల్లుపై సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర చర్చ జరిగింది. కార్మిక మంత్రి అనిల్ విజ్ మాట్లాడుతూ.. 'చిన్న సంస్థలపై భారాన్ని తగ్గించడం, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మెరుగుపరచడమే మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే 10 గంటల పని విధానం ఉంది' అని పేర్కొన్నారు. మరోవైపు ప్రతిపక్ష నేత సుర్జేవాలా దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. 'రోజుకు 10 గంటలు, దానికి తోడు 2 గంటల ఓవర్ టైమ్ కలిపితే ఒక కార్మికుడు 12 గంటలు పని చేయాల్సి ఉంటుంది. ఇది ఆధునిక బానిసత్వం కిందకు వస్తుంది. ఇలా అయితే ఒక కార్మికుడు తన కుటుంబంతో గడిపే సమయం ఎక్కడ ఉంటుంది?' అని ప్రశ్నించారు.

# రూపాయికి ఆర్‌బీఐ రక్షణ కవచం

భారత రూపాయి విలువ గత కొన్ని నెలలుగా ఒత్తిడికి లోనవుతోంది. అందుకు అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, అమెరికా వాణిజ్య సుంకాల పెంపు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ.. వంటివి చాలా కారణాలున్నాయి. ఈ క్రమంలో రూపాయి మరింత నేలచూపులు చూడకుండా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) చురుకైన చర్యలు చేపట్టింది. ప్రస్తుతం (డిసెంబర్ 2025 నాటికి) భారత రూపాయి విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే చారిత్రక కనిష్ఠ స్థాయిలకు చేరుకుంది. ఇటీవలి కాలంలో రూపాయి విలువ రూ.91 మార్కును తాకి స్వల్పంగా పుంజుకుంది. ఈ తీవ్ర ఒడిదుడుకులను అరికట్టడానికి ఆర్‌బీఐ తన వద్ద ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఉపయోగించి మార్కెట్‌లో డాలర్లను విక్రయిస్తోంది.



**ఆర్‌బీఐ జోక్యం**

తాజా అధికారిక సమాచారం ప్రకారం, రూపాయి విలువను కాపాడేందుకు ఆర్‌బీఐ భారీ స్థాయిలో డాలర్లను విక్రయించింది. అక్టోబర్ నెలలో నికరంగా 11.9 బిలియన్ డాలర్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించింది. రూపాయి విలువ రూ.89 మార్కును దాటకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టింది. కానీ అంతర్జాతీయ పరిస్థితులు దృష్ట్యా రూపాయి విలువ రూ.91కు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ వరకు ఆర్‌బీఐ దాదాపు 34.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.91 లక్షల కోట్లు) విలువైన డాలర్లను అమ్మి రూపాయి పతనాన్ని అడ్డుకుంది. డిసెంబర్ 12, 2025 నాటికి భారత విదేశీ మారక నిల్వలు 688.95 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. సెప్టెంబర్ 2024లో ఉన్న 704 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయి నుంచి కొంత తగ్గినప్పటికీ, ఇప్పటికీ ఇవి దేశానికి పటిష్టమైన రక్షణను కల్పిస్తున్నాయి.

**రూపాయి బలహీనపడటానికి కారణాలు**

ట్రంప్ ప్రభుత్వ సుంకాల పెంపు భారత ఎగుమతులపై ప్రభావం చూపడం రూపాయి బలహీనతకు ఒక కారణం. ఈ ఏడాది విదేశీ మదుపరులు భారత మార్కెట్ల నుంచి సుమారు 17 బిలియన్ డాలర్లను వెనక్కి తీసుకోవడం రూపాయిపై ఒత్తిడి పెంచింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల పెరుగుదల వల్ల మన దేశం ఎక్కువ డాలర్లను చెల్లించాల్సి రావడం రూపాయి విలువను తగ్గిస్తోంది.

**ఆర్‌బీఐ చర్యల పర్యావసానాలు**

రూపాయి ఒక్కసారిగా పడిపోతే దిగుమతి చేసుకునే వస్తువుల (పెట్రోల్, ఎలక్ట్రానిక్స్) ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. ఆర్‌బీఐ జోక్యం వల్ల ఈ ధరలు అదుపులో ఉంటాయి. రూపాయి విలువ మరీ అస్థిరంగా ఉంటే విదేశీ పెట్టుబడిదారులు ఆందోళన చెందే ప్రమాదం ఉంటుంది. ఆర్‌బీఐ నియంత్రణ వారిలో నమ్మకాన్ని పెంచుతుంది.

**ప్రతికూలతలు**

డాలర్లను విక్రయించడం వల్ల దేశ విదేశీ మారక నిల్వలు క్రమంగా తగ్గుతాయి. ఇది భవిష్యత్తులో వచ్చే ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కోవడంలో ఆటంకం కావచ్చు. ఆర్‌బీఐ డాలర్లను అమ్మడం వల్ల మార్కెట్‌లో నగదు లభ్యత తగ్గుతుంది. దీన్ని సర్దుబాటు చేసేందుకు ఆర్‌బీఐ ఇటీవల రూ.2.90 లక్షల కోట్ల లిక్విడిటీ లభ్యత చర్యలను ప్రకటించింది. భారత రూపాయి ఒడిదుడుకులకు లోనవుతున్నప్పటికీ, ఆర్‌బీఐ తన వద్ద ఉన్న అపారమైన విదేశీ మారక నిల్వలతో రక్షణ గోడలా నిలుస్తోంది. కేవలం రూపాయి విలువను పెంచడం కంటే, మార్కెట్‌లో తీవ్రమైన అస్థిరత లేకుండా చూడటమే ఆర్‌బీఐ ప్రధాన లక్ష్యమని గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు కుదిరితే రూపాయి మళ్లీ పుంజుకునే అవకాశం ఉంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# హెచ్–1బీ లాటరీకి చెల్లుచీటీ

- హెచ్చు నైపుణ్యం, వేతనం
- ఇవే వీసా జారీకి కొత్త ప్రాతిపదిక
- ట్రంప్ సర్కారు కీలక నిర్ణయం
- భారతీయులకు శరాఘాతమే




**న్యూయార్క్ /వాషింగ్టన్:** హెచ్-1బీ వీసాలపై కొంతకాలంగా కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్న ట్రంప్ సర్కారు వాటి కట్టడి దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. హెచ్-1బీ వీసాదారుల ఎంపికకు పాటిస్తున్న లాటరీ విధానాన్ని రద్దు చేస్తున్నట్టు హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ విభాగం మంగళవారం ప్రకటించింది. ఇకపై అత్యధిక నైపుణ్యం, వేతనం ఉన్న వారికే ఆ వీసాల జారీలో అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టంచేసింది. దీంతో నైపుణ్యం తక్కువగా ఉన్న విదేశీ ఉద్యోగుల రాక తగ్గిపోయి ఆ ఉద్యోగాలు అమెరికన్లకు దక్కే అవకాశముంది. హెచ్-1బీ వీసాల జారీని ఇకపై యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్విసెస్(యూఎస్‌సీఐఎస్) ద్వారా చేపట్టనుంది. ''ఇప్పటిదాకా కొనసాగిన కంప్యూటరైజ్డ్ హెచ్-1బీ వీసా లాటరీ వ్యవస్థ లోపభూయిష్టంగా తయారైంది. దీనిని కంపెనీలు ఎంతగానో దుర్వినియోగం చేశాయి. విదేశీ ఉద్యోగులను కారుచవగ్గా తీసుకొచ్చి అమెరికాలో పని చేయించుకున్నాయి. ఫలితంగా ఐటీ తదితర ఉద్యోగాల్లో అమెరికన్లకు చాలా అన్యాయం జరిగింది. ఇకపై దీన్ని సరిదిద్దుతాం. ఇకపై నాలుగు రకాలుగా వేతనాలను వర్గీకరించి దానికనుగుణంగా హెచ్-1బీలను జారీచేస్తాం. ఎంట్రీ లెవల్ అభ్యర్థులు(1), అర్హత సాధించిన అభ్యర్థులు(2), అనుభవం ఉన్న అభ్యర్థులు(3), అత్యధిక నైపుణ్యమున్న అభ్యర్థులు(4)గా దరఖాస్తులను విభజించి ఆ మేరకే హెచ్-1బీ వీసాలను జారీచేయాలని ప్రతిపాదించాం. ఈ ప్రతిపాదనలను ఆఫీస్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ బడ్జెట్ (ఓఎంబీ)కి సమీక్ష కోసం పంపించాం. అక్కడ ఆమోదం పొందాక ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురిస్తాం. ఆ తర్వాత 30 రోజులకు కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయి'' అని యూఎస్‌సీఐఎస్ అధికార ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ స్పష్టం చేశారు. హెచ్-1బీ వీసా విధానాన్ని సమూలంగా సంస్కరించాలన్న ట్రంప్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అయితే అన్ని స్థాయిల్లో అర్హులకు వీసాలు లభించేలా చూసే ప్రయత్నం జరుగుతుందంటూ ఆయన ముక్తాయించారు. కొత్త విధానం వచ్చే ఫిబ్రవరి 27వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. అమెరికాలో ఉన్నతోద్యోగాలు చేయాలన్న విద్యాధిక భారత యువత, ముఖ్యంగా ఐటీ జీవుల కలలపై ఈ నిర్ణయం మరిన్ని నీళ్లు చల్లింది.

# పాక్ నేత తిరుగుబాటు..




**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌కు చెందిన నేత ఒకరు తమ దేశం వ్యవహరిస్తున్న తీరుపై పశ్చాత్తాప ధోరణిలో మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. ఆఫ్ఘనిస్తాన్‌పై పాక్ జరిపిన సైనిక దాడులను జమియత్ ఉలేమా ఈ ఇస్లాం ఎఫ్ (జేయూఐఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ తప్పుబట్టారు. పాక్ సైన్యం జరిపిన దాడుల్లో సామాన్య పౌరులు మృతి చెందడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌పై దాడులు చేయడం సరైనదని పాక్ భావించినప్పుడు.. భారతదేశం తన పొరుగుదేశమైన పాకిస్తాన్‌పై దాడులు చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' గురించి ప్రస్తావిస్తూ రెహ్మాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత మే 7న భారత దళాలు పాకిస్తాన్ భూభాగంలోని బహవల్పూర్, మురిడ్కే, పీఓకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై క్షిపణి దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 22న 26 మంది భారతీయులను లష్కరే ఎ తోయిబా ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నందుకు ప్రతీకారంగా భారత్ ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ దాడులను పాక్ నేత బహిరంగంగా ప్రస్తావించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కరాచీలో జరిగిన ఒక సమావేశంలో మాట్లాడిన రెహ్మాన్.. పాకిస్తాన్ అనుసరిస్తున్న ద్వంద్వ విధానాన్ని ఎండగట్టారు. 'భారతదేశం.. పాక్‌లోని బహవల్పూర్, మురిడ్కేలలో ఉగ్రవాద గ్రూపుల ప్రధాన కార్యాలయాలపై దాడి చేసినప్పుడు పాక్ ఎందుకు అభ్యంతరాలు లేవనెత్తింది? ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్ కూడా పాకిస్తాన్‌పై అలాంటి ఆరోపణలు చేస్తోంది' అని ఆయన నిలదీశారు. పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ సారథ్యంలో జరుగుతున్న ఈ సరిహద్దు దాడులు అంతర్జాతీయంగా దేశ ప్రతిష్టను దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్తాన్ పౌరులపై పాకిస్తాన్ జరిపిన దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా తీవ్రంగా ఖండించింది. ఆఫ్ఘనిస్తాన్ ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని భారత్ సమర్థిస్తుందని ఎంఈఏ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. 2021లో తాలిబాన్ల పాలన వచ్చినప్పటి నుండి పాక్‌ఆఫ్ఘన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ విషయంలో పాక్ నేతలు తమ దేశ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇది పాకిస్తాన్‌ను అంతర్జాతీయంగా ఇరకాటంలో పడేసే పరిణామంగా మారింది.

# గ్రీన్‌కార్డులపై గూగుల్ గుడ్‌న్యూస్

### హెచ్–1బీ వీసాదారులకు శాశ్వత నివాసిత హోదా .. 'పెర్మ్'ప్రక్రియను వేగవంతం చేస్తామని వెల్లడి.. విదేశీ ఉద్యోగులకు అంతర్గతంగా సమాచారం

**వాషింగ్టన్:** అమెరికాలో హెచ్-1బీ వీసాతో గూగుల్ సంస్థలో పని చేస్తున్నవారికి శుభవార్త. వారి గ్రీన్‌కార్డు కలలకు త్వరలోనే మోక్షం లభించనుంది. తమ ఉద్యోగుల గ్రీన్‌కార్డు స్పాన్సర్‌షిప్ ప్రక్రియను వచ్చే ఏడాది వేగవంతం చేయబోతున్నట్లు గూగుల్ యాజమాన్యం వెల్లడించింది. ఈ మేరకు సంబంధిత ఉద్యోగులకు సమాచారం చేరవేసింది. అమెరికాలో వేలాది మంది విదేశీయులు తాత్కాలిక వీసాలతో గూగుల్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కంపెనీ స్పాన్సర్‌షిప్‌తో శాశ్వత నివాసిత హోదా(గ్రీన్‌కార్డు) పొందాలని చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. నిజానికి వారికి గత రెండేళ్లుగా గ్రీన్‌కార్డు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అర్హులైన ఉద్యోగులకు గ్రీన్‌కార్డులు లభించడానికి వీలుగా ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్ (పెర్మ్) దరఖాస్తులు స్వీకరించడంతోపాటు వాటికి ప్రభుత్వం నుంచి త్వరగా ఆమోదం లభించేలా చర్యలు చేపట్టబోతున్నట్లు గూగుల్ యాజమాన్యం తెలియజేసింది. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డు పొందడంలో పెర్మ్ అనేది కీలకమైన ప్రక్రియ. అమెరికాలోని టెక్నాలజీ కంపెనీలు ఈ ప్రక్రియను విస్తృతంగా వాడుకుంటాయి. టెంపరరీ వర్క్ వీసాలపై పని చేస్తున్న తమ ఉద్యోగులకు పర్మనెంట్ రెసిడెన్సీ స్టేటస్ వచ్చేలా సహకరిస్తాయి. పెర్మ్‌కు అర్హులైన వారికి వచ్చే ఏడాది తొలి త్రైమాసికంలో గ్రీన్‌కార్డు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, దీనిపై గూగుల్ బహిరంగంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతర్గతంగా సమాచారం మాత్రం ఇచ్చింది. అమెరికాలో మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలు వర్క్ వీసాలపై పని చేస్తున్న తమ ఉద్యోగులకు కీలక సూచన జారీ చేశాయి. విదేశీలకు వెళ్లాలన్న ఆలోచన ఉంటే వాయిదా వేసుకోవాలని తెలియజేశాయి. అంతర్జాతీయ ప్రయాణాలు ఇప్పుడే వద్దని పేర్కొన్నాయి. విదేశాల్లోని అమెరికా ఎంబీసీలు, కాన్సులేట్లలో వీసా స్టాంపింగ్ చాలా ఆలస్యమవుతోంది. నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఏడాది కాలం పడుతోందని చెబుతున్నారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో విదేశాలకు వెళ్లిరావడం కష్టమన్న ఉద్దేశంతోనే ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని టెక్ కంపెనీలు సూచించాయి. ఈ మేరకు కొన్ని రోజులుగా తమ ఉద్యోగులకు సమాచారం అందిస్తున్నాయి.



# శ్రుతిహాసన్ ట్రైన్ వచ్చేస్తుంది

కోలీవుడ్‌లో చాలా కాలంగా నిర్మాణంలో ఉన్న చిత్రం 'ట్రైన్'.. విజయ్ సేతుపతి, నటి శ్రుతిహాసన్ జంటగా నటించిన చిత్రం ఇది. యూగీసేతు, నరేన్, సంపత్ రామ్ ముఖ్యపాత్రలు పోషించారు. నటుడు నాజర్, వి.క్రియేషన్ పతాకంపై కలైపులి ఎస్ థాను నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పాపులర్ దర్శకుడు మిష్కిన్ తెరకెక్కిస్తున్నారు. ఈయన చిత్రాలు వైవిధ్యంగా ఉంటాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ట్రైన్ చిత్రం కూడా అదేవిధంగా ఉంటుందని భావించవచ్చు. ఇది విజయ్‌సేతుపతి, శ్రుతిహాసన్ రేర్ కాంబినేషన్లో రూపొందిన చిత్రం. ఇందులో విజయ్‌సేతుపతి, శ్రుతిహాసన్‌ల గెటప్ చాలా డిఫరెంట్‌గా ఉన్నాయి.

శ్రుతిహాసన్ ఇటీవల వైవిధ్య భరిత కథా పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తున్న విషయం తెలిసిందే. ఆ మధ్య సలార్, ఆ తరువాత రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ చిత్రాల్లో ఈమె పాత్రలు అంతకు ముందు నటించిన పాత్రలకు భిన్నంగా ఉన్న విషయం తెలిసిందే. అదేవిధంగా ట్రైన్ చిత్రంలో కూడా శ్రుతిహాసన్ గెటప్ కొత్తగా ఉంది.

ఈ చిత్రం ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు తాజాగా అప్‌డేట్‌ను యూనిట్ సభ్యులు వెల్లడించారు. ఈచిత్ర సింగిల్‌సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ పాట ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీంతో త్వరలోనే ట్రైన్ చిత్రం తెరపైకి రానుందని సమాచారం. మరో విషయం ఏమిటంటే తాజాగా విడుదలైన పాటను శ్రుతిహాసన్ పాడడం విశేషం. వచ్చే ఏడాది ప్రారంభంలోనే తెలుగు, తమిళ్‌లో విడుదల కానుంది.






## సందీప్ కిషన్ యాక్షన్ మూవీ..
## తెలుగు టీజర్ చూశారా?

టాలీవుడ్ హీరో సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తోన్న లేటేస్ట్ కోలీవుడ్ మూవీ సిగ్మా. ఈ చిత్రంతో దళపతి తనయుడు జాసన్ సంజయ్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ మూవీని యాక్షన్ కామెడీ అడ్వెంచర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ చూస్తుంటే కామెడీ యాక్షన్‌తో పాటు అడ్వెంచరస్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఇందులో ఫైట్ సీన్స్, విజువల్స్ ఈ సినిమాపై అంచనాలు మరించ పెంచు తున్నాయి. ఈ సినిమా వచ్చే ఏడాది తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తున్నారు. ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు థాసన్, యోగ్ జాపీ, మగలక్ష్మి, షీలా రాజ్‌కుమార్, కమలేష్, కిరణ్ కొండా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## నా బిడ్డ ఎవరో తెలుసా..?
### మైసా గ్లింప్స్‌లో అదరగొట్టేసిన రష్మిక


ఈ ఏడాది బాక్సాఫీస్‌ను రప్ప రప్పా ఆడించేసింది రష్మిక మందన్నా.. తను హీరోయిన్‌గా నటించిన ఛావా, థామా, కుబేర, ద గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలు వందల కోట్లు రాబట్టాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ మైసా అనే లేడీ ఓరియంటెడ్ ఫిలిం చేస్తోంది. బుధవారం (డిసెంబర్ 24న) ఈ సినిమా నుంచి ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. "నా బిడ్డ సచ్చిందన్నారు. కానీ మట్టే వణికిపోయింది.. నా బిడ్డ రక్తాన్ని దాసలేక, గాలే ఆగిపోయింది.. దాని ఊపిరి మోయలేక, అగ్గే బూడిదైంది.. మండుతున్న నా బిడ్డని సూడలేక.." అన్న సంభాషణతో వీడియో మొదలైంది. నా బిడ్డను సంపలేక సావే సచ్చిపోయింది.. నా బిడ్డ ఎవరో తెలుసా.. అంటూ రష్మికను పవరల్‌ఫుల్ లేడీ వారియర్‌గా చూపించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ నిర్మిస్తోంది. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ 2026లో విడుదల కానుంది.




## డైలాగ్ ఒక్కటీ లేకుండా భయపెట్టించిన గ్లింప్స్..

డిఫరెంట్ కాన్సెప్ట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు రవిబాబు తన తదుపరి సినిమాను అధికారికంగా ప్రకటించారు. పూర్తిగా డైలాగ్‌లేని, భీకరమైన విజువల్స్‌తో కూడిన గ్లింప్స్‌ను విడుదల చేస్తూ, తన కొత్త సినిమా టైటిల్‌ను 'రేజర్' గా వెల్లడించారు. 45 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్ పూర్తిగా థ్రిల్లర్ టోన్‌లో సాగింది. చేతులను నరికేయడం, శరీరాన్ని రెండు ముక్కలుగా కోయడం, కత్తితో తల నరికే సన్నివేశాలు చూపిస్తూ, ఒక్క మాట కూడా లేకుండా ప్రేక్షకులను షాక్‌కు గురిచేసింది. విజువల్స్ ఆధారంగా కథా భావనను తెలియజేయడం ఈ గ్లింప్స్ ప్రత్యేకతగా నిలిచింది. ఈ గ్లింప్స్‌లో రవిబాబు తప్ప మరే ఇతర ప్రముఖ నటులు కనిపించలేదు లేదా ప్రకటించడం చేయలేదు. అయితే, చూపించిన సన్నివేశాలు మాత్రం థ్రిల్లర్ సినిమాల అభిమానులను వెంటనే ఆకట్టుకునేలా ఉన్నాయి. ముఖ్యంగా డార్క్, వైలెంట్ థ్రిల్లర్ జానర్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా గట్టిగా కనెక్ట్ అవుతుందనే టాక్ వినిపిస్తోంది.ఈ చిత్రాన్ని ఫ్లయింగ్ ఫ్రాగ్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ రెండు బ్యానర్లు మరోసారి కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రేజర్' సినిమాను సమ్మర్ 2026లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే గ్లింప్స్‌తోనే హాట్ టాపిక్‌గా మారిన 'రేజర్'పై మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. మరోసారి తన డిఫరెంట్ టేక్‌తో రవిబాబు ప్రేక్షకులను షాక్‌కు గురిచేస్తాడా అనే ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. ఇప్పటివరకు డిఫరెంట్ కాన్సెప్ట్స్, వినూత్న కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రవిబాబు, ఈసారి కూడా అదే స్థాయిలో ఒక కొత్త క్రైమ్ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారని తెలుస్తోంది. గతంలో రవిబాబు అల్లరి, అనసూయ, నచ్చావులే, నువ్విలా, అమరావతి, అవును, ఆవిరి, క్రష్.. లాంటి డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలతో ప్రేక్షకులని అలరించిన విషయం తెలిసిందే

## కొత్త డాన్ తప్పుకున్నాడా?



'ధురంధర్' సినిమా బ్లాక్‌బస్టర్ సక్సెస్‌తో మంచి జోష్‌లో ఉన్నారు హీరో రణ్‌వీర్ సింగ్. అయితే 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ సింగ్ తప్పుకుంటున్నారనే టాక్ బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3' సినిమా రానున్నట్లుగా 2023 ఆగస్టు 9న ప్రకటన వచ్చింది. రితేష్ సిద్వానీ, ఫర్హాన్ అక్తర్ ఈ 'డాన్ 3' సినిమాను నిర్మిస్తారని, 2025లో ఈ సినిమా విడుదలవుతుందనేది ఆ అనౌన్స్‌మెంట్ సారాంశం. కానీ వివిధ కారణాల వల్ల రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3' సినిమా ఇంకా సెట్స్‌కు వెళ్లలేదు. 'ధురంధర్' సినిమా తర్వాత రణ్‌వీర్ సింగ్ నెక్స్ మూవీ 'డాన్ 3' అని అందరూ అనుకున్నారు. కానీ రణ్‌వీర్ సింగ్ ఈ సినిమా నుంచి తప్పుకోవాలనుకుంటున్నారని బీ టౌక్. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక 'డాన్ 3' సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చినప్పుడు 'డాన్'గా రణ్‌వీర్ సింగ్ వెండితెరపై కరెక్ట్ కాదన్నట్లుగా కొంతమంది షారుక్ ఖాన్ అభిమానులు సోషల్ మీడియాలో విమర్శించారు (ఫర్హాన్ అక్తర్ డైరెక్షన్‌లో వచ్చిన 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్ (2006), 'డాన్ 2 (2011) చిత్రాల్లో షారుక్ ఖాన్ హీరోగా నటించారు). కానీ 'డాన్ 3'లో యాక్టర్‌గా తాను ప్రేక్షకులను మెప్పిస్తానని రణ్‌వీర్ సింగ్ రెస్పాండ్ అయ్యారు. అయితే ఈ ప్రాజెక్ట్ నుంచి ఆయన తప్పుకుంటున్నట్లు ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే... రణ్‌వీర్ సింగ్ కొత్త సినిమాకు 'ప్రళయ్' అనే టైటిల్ ఖరారైందని, ఇదొక జాంబీ ఫిల్మ్ అని, ఒక తండ్రి తన కుటుంబాన్ని ఎలా రక్షించుకుంటాడు? అనే కోణంలో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ టాక్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com